


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్**

- నేడు విశాఖలో మంత్రి లోకేష్ శంకుస్థాపన
- రూ.1,500 కోట్ల పెట్టుబడి, 25 వేల మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు

5

## కాలానుగుణంగా మారాలి..

# నాయకత్వ పటిమ పెంచుకోవాలి



- పార్టీ భావజాలం, సిద్ధాంతాలపై పూర్తి అవగాహన ఉండాలి
- డబ్బుతోనే ఎన్నికలు గెలవలేం
- ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలి
- ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పార్టీ బలోపేతం కావాలి
- మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

2

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల శిక్షణా శిబిరానికి హాజరయ్యాను. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొన్నాను. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ హయాంలో... నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని హైదరాబాద్ లో జరిగిన శిక్షణా శిబిరాల విషయాలను ఈ సందర్భంగా నేతలతో పంచుకున్నాను. కోటి మంది పార్టీ క్రియాశీలక సభ్యులతో దేశంలో బలమైన పార్టీగా ఉన్న తెలుగుదేశం సిద్ధాంతాలను ప్రజల వద్దకు మరింతగా తీసుకువెళ్లేందుకు ఈ శిక్షణా కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుంది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, పార్టీ విధానాలు, ప్రభుత్వ ఆలోచనలు, విజయాలు, నాయకత్వ లక్షణాలు, సంక్షేమ పథకాల అమలు, కార్యకర్తలకు గౌరవం, అందలం వంటి అంశాలపై వారితో చర్చించాను. వారి అభిప్రాయాలు తెలుసుకున్నాను. గ్రామస్థాయిలో అన్ని పరిస్థితులు, మంచి చెడులు తెలుసుకోవడానికి కూడా ఈ కార్యక్రమం మంచి వేదిక అవుతుంది. కార్యకర్తే అధినేత అనే సిద్ధాంతంతో పనిచేసే తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలను కలుసుకునే ప్రతి సందర్భం నాకు ప్రత్యేకమే. ఈ సమావేశం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించింది.

*- టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు*

## ఆధునిక పరిశోధనల కేంద్రంగా..

# అమరావతి క్వాంటం వ్యాలీ వెలుగొందాలి




- సీఎం చంద్రబాబు ఆకాంక్ష
- కొత్త ఔషధాలపై పరిశోధనకు ముందుకు వచ్చిన గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీ
- అభినందనలు తెలిపిన సీఎం
- సచివాలయంలో సీఎంతో పరిశోధకులు, విద్యావేత్తల బృందం భేటీ

2

## 'అఖండ' విజయమే!

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): అగ్రనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన పాన్ ఇండియా మూవీ అఖండ-2 ఘన విజయం సాధించాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. అఖండ -2 సినిమాలో బాలా మామయ్య నట తాండవం ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. గాడ్ ఆఫ్ మాసెస్ మూవీ అంటే సౌండ్ బాక్సులు బద్దలయ్యే విజయ నినాదం. అఖండ -2 అఖండ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఐదు దశాబ్దాల సినీ చరిత్రలో మరో ఘనవిజయం సొంతం చేసుకోబోతున్న బాలా మామయ్యకు అభినందనలు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.






# పట్టణాలకు తాగునీటి భద్రత

- రూ.9,514 కోట్లతో అమృత్-2 పెండింగ్ పనులు
- 506 పనులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రాజధాని అమరావతిలో కీలక ప్రాజెక్ట్‌లకు అనుమతి
- జాతీయ రహదారితో సీడ్ యాక్సెస్ రోడ్డు అనుసంధానం
- 7 క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- ఏడాదిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం
- రూ.5445 కోట్లతో పీఎం సూర్యఘర్ ప్రాజెక్ట్ అమలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పార్థసారథి

3

# ఏపీలో చంద్రబాబు పాలన భేష్

- భారీ పెట్టుబడులతో అభివృద్ధి పరుగులు
- జగన్ పార్టీ విమర్శలకు ఘాటుగా బదులివ్వాలి
- బీజేపీ ఎంపీలతో ప్రధాని మోదీ

4

# నేడు విశాఖకు సీఎం చంద్రబాబు




- కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు శంకుస్థాపన
- హాజరుకానున్న విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్
- రూ.1,583 కోట్ల పెట్టుబడి, 8వేల మందికి ఉపాధి
- వెయ్యి సీటింగ్ కెపాసిటీతో తాత్కాలిక క్యాంపస్‌లో కార్యకలాపాలు
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి లోకేష్
- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపైనా సీఎం సమీక్ష

4

## కాగ్నిజెంట్, సత్వాతో పాటు విశాఖలో..

# మరో 7 ఐటీ సంస్థలకు నేడు భూమిపూజ

- శంకుస్థాపన శిలా ఫలకాలను ఆవిష్కరించనున్న మంత్రి లోకేష్
- 3,740 కోట్ల మేర ఐటీ సంస్థల పెట్టుబడి
- 41,700 మందికి ఉద్యోగావకాశాలు

4

# ఆధునిక పరిశోధనల కేంద్రంగా..

# అమరావతి క్వాంటం వ్యాలీ వెలుగొందాలి

- సీఎం చంద్రబాబు ఆకాంక్ష
- కొత్త ఔషధాలపై పరిశోధనకు ముందుకు వచ్చిన గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీ
- అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి
- సచివాలయంలో సీఎంతో పరిశోధకులు, విద్యావేత్తల బృందం భేటీ



అమరావతి (చైతన్యరథం): అమరావతిలో ఏర్పాటు అవుతున్న క్వాంటం వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. విద్య, వైద్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ రంగాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం (ఏక్యూసీసీ) పనిచేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో గురువారం వివిధ దేశాల నుంచి బృందంగా వచ్చిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సీఎం సమావేశం అయ్యారు. వైద్యరంగంలో నూతన ఔషధాల రూపకల్పనతో పాటు మెటీరియల్ సైన్స్‌పై పరిశోధనలకు గానూ గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమని ముఖ్యమంత్రికి పరిశోధకులు, విద్యావేత్తల బృందం తెలిపింది. దేశంలోనే తొలి క్వాంటం బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా ఏర్పాటు అవుతున్నట్టు వివరించింది. గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీ బృందం సభ్యులకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి.. వైద్యారోగ్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ అంశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. క్వాంటం పరిశోధనలతో బయోసెన్సార్ల లాంటి అప్లికేషన్లను కూడా ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తేవాల్సి ఉందన్నారు. అమరావతిలో త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సీఎం వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు ఈ క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాయని వారికి వివరించారు. నేషనల్ క్వాంటం మిషన్ కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తుంటే మొత్తంగా క్వాంటం ఎకో సిస్టం అమరావతికి వస్తోందని సీఎం అన్నారు. గతంలో అందిపుచ్చుకున్న ఐటీ, జీనోమ్ వ్యాలీ లాంటి వ్యవస్థలు ఇప్పుడు విజయగాథలుగా మారాయని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పుడు క్వాంటం గురించి అంతా ఆలోచిస్తున్న సమయంలో ఆ రంగంలో పనిచేయడానికి ఔత్సాహిక కంపెనీలు ఏపీని సంప్రదిస్తున్నాయన్నారు. అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం కంప్యూటర్ కేంద్రం ద్వారా పరిశోధనలు చేసి ఔషధాలు, మెటీరియల్ సైన్స్ సహా వివిధ అంశాల్లో వినూత్న ఆవిష్కరణలు తీసుకురావాలని స్పష్టం చేశారు. క్వాంటం బయోఫౌండ్రీ అనేది వినూత్న ఆలోచన అని ముఖ్యమంత్రి అభినందించారు. బయోమెడికల్ రీసెర్చ్‌తో పాటు వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, రవాణా సహా వేర్వేరు రంగాల్లోని భాగస్వాములు క్వాంటం వ్యాలీ సేవలను వినియోగించుకునేలా ఎకో సిస్టం అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, రీసెర్చ్ సంస్థలకు ఏక్యూసీసీ కేంద్రంగా మారుతుందని తెలిపారు. రూ.200 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ క్వాంటం బయోఫౌండ్రీ ద్వారా మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటిరియల్ సైన్స్‌పై పరిశోధనలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విద్యావేత్తలు, పరిశోధకుల బృందం వివరించింది. క్వాంటం వ్యాలీతో పాటు, ఏపీలో అమలవుతున్న విధానాలను తమను ఆకర్షించాయని గ్లోబల్ క్వాంటం బయోఫౌండ్రీ ప్రతినిధులు సీఎంకు తెలిపారు.

# కాలానుగుణంగా మారాలి..

# నాయకత్వ పటిమ పెంచుకోవాలి



- పార్టీ భావజాలం, సిద్ధాంతాలపై పూర్తి అవగాహన ఉండాలి
- డబ్బుతోనే ఎన్నికలు గెలవలేం
- ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలి
- ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పార్టీ బలోపేతం కావాలి
- మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): మారుతున్న కాలానికి అనుగుణంగా నాయకత్వం ఆలోచనలు కూడా మారాలని పార్టీ నేతలకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, భావజాలంపై నాయకులు, కార్యకర్తలందరికీ పూర్తి అవగాహన ఉండాలన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న టీడీపీ క్యాడర్ శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మానవ వనరుల విభాగం చైర్మన్ వేపాడ చిరంజీవిరావు, ఇతర ముఖ్య నాయకులు, శిక్షణకు హాజరైన ప్రతినిధులు సీఎంకు సాదర స్వాగతం పలికారు. శిక్షణలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ముచ్చటించిన చంద్రబాబు.. శిక్షణ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ హయాంలో జరిగిన శిక్షణ కార్యక్రమాలను ఆయన గుర్తు చేసుకున్నారు. నాడు చెట్ల కింద ఎర్రటి ఎండలో శిక్షణ తరగతులు చేపట్టేవాళ్ళం, కానీ నేడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చల్లటి ఏసీ గదుల్లో శిక్షణ నిర్వహిస్తున్నాం. మారుతున్న టెక్నాలజీ, పరిస్థితులకు అనుగుణంగా నాయకులు కూడా తమ నాయకత్వ పటిమను మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ సిద్ధాంతాలు, భావజాలంపై పూర్తి అవగాహన ఉండాలని ఆయన స్పష్టం చేశారు.


### పనితీరు, క్రమశిక్షణే గెలుపు మంత్రం

పార్టీ శ్రేణులు సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేయాలని చంద్రబాబు ఉద్బోధించారు. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పార్టీ బలోపేతం కావాలని, ఎప్పటికప్పుడు బలాబలాలు చూసుకోవాలని సూచించారు. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే బలహీనంగా ఉన్న నియోజకవర్గంలోనూ పార్టీ బలపడుతుంది. అదే బలహీన నేతకు మంచి నియోజకవర్గం ఇచ్చినా పార్టీని బలహీన పరుస్తారని విశ్లేషించారు. డబ్బుతోనే ఎన్నికలు గెలవలేమని, మనం చేసే మంచి పనులను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లినప్పుడే విజయం సాధ్యమని స్పష్టం చేశారు. చక్కటి పనితీరు, క్రమశిక్షణే గెలుపు మంత్రంగా అభివర్ణించారు. డబ్బుతోనే ఎన్నికలను గెలవగలమని కొందరు భావిస్తారు... కానీ మనం చేసే మంచి పనుల్ని ప్రజలకు నిత్యం వివరిస్తేనే గెలవగలం. గతంలో టెక్నాలజీ ఉండేది కాదు... ఇప్పుడు చాలా పీక్‌కు వెళ్లింది. దానిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయం.. కార్యకర్తలే బలం

ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని, కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని సీఎం చంద్రబాబు అన్నారు. నేతలు, కార్యకర్తలను కలిసేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. అన్నదాత సుఖీభవ, దీపం-2.0, స్త్రీశక్తి, తల్లికి వందనం వంటి కీలక పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని వెల్లడించారు. ఈ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి, మహిళల ఓటు బ్యాంక్ మెజార్టీ శాతం పార్టీకే దక్కేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని దిశానిర్దేశం చేశారు.

2019 నుంచి 2024 వరకు జరిగిన విధ్వంసం వల్ల వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, వాటిని ఇప్పుడు సరిచేసి గాడిన పెట్టామని సీఎం పేర్కొన్నారు. పింఛన్ల కోసం ఏడాదికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో



ఉన్నప్పుడు ఎంత పట్టుదలతో పనిచేశారో.. ఇప్పుడూ అంతకు మించిన స్థాయిలో పనిచేయాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు.

### శిక్షణ విధానాన్ని సీఎంకు వివరించిన విప్ వేపాడ

ఈ సందర్భంగా శిక్షణా తరగతులను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు తరగతుల నిర్వహణా తీరును సీఎం చంద్రబాబుకు వివరించారు. పార్లమెంటుకు ఇద్దరు చొప్పున 50 మండల పార్టీ ప్రెసిడెంట్లకు, 50 సెక్రటరీలకు కలిపి సుమారు 100 మంది చొప్పున ఇప్పటికి రెండు బ్యాచ్‌లు నిర్వహించామన్నారు. ఇది మూడవ బ్యాచ్ అని చెప్పారు. 100 మందిని నాలుగు గ్రూపులుగా.. అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీ శక్తి, తల్లికి వందనంగా విభజించి నాలుగు గ్రూపులకు వేరు వేరుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు యోగా లేదా ధ్యానంతో శిక్షణ ప్రారంభించి ప్రతీ క్లాస్ అయిన తర్వాత ఆ అంశం పై ఇంటరాక్టివ్ సెషన్ పెడుతున్నామన్నారు. పార్టీ ఆవిర్భావం - చరిత్ర - భావజాలం, పార్టీ నిర్మాణం, మండల పార్టీ అధ్యక్షుడి పాత్ర- బాధ్యతలు, కేస్ స్టడీస్ - గ్రూప్ డిస్కషన్, క్యాడర్‌కు బీమా - సంక్షేమం- సాధికారత, సూపర్ సిక్స్ - 18 నెలల ప్రభుత్వ సాధనలు, సాంకేతిక పరిజ్ఞానం,సోషల్ మీడియా - వినియోగం, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. పాల్గొన్న ప్రతినిధులు, ట్రైనర్స్ నుంచి శిక్షణ ఎలా ఉంది, మెరుగుపరచడానికి సూచనలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రతినిధులతో ఫోటో సెషన్ నిర్వహించి, ప్రశంసా పత్రం అందిస్తున్నట్టు చెప్పారు.



# పట్టణాలకు తాగునీటి భద్రత

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ఆర్థిక, సాంకేతిక భవిష్యత్తుకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పెట్టుబడుల ఆమోదం, క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ ఏర్పాటు నుండి ఉద్యోగుల డీఏ మంజూరు వరకు... పర్యాటక రంగం నుండి క్రీడల ప్రోత్సాహం వరకు... అన్ని రంగాల్లోనూ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. నగరాలు, పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేలా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించి అమృత్ 2 పథకంలో భాగంగా దాదాపు రూ.9,514 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో కీలక ప్రాజెక్టలకు అనుమతి ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో దాదాపు రెండున్నర గంటలపాటు సాగిన మంత్రివర్గ సమావేశం లో 44 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత కేబినెట్ నిర్ణయాలను గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. రూ.163కోట్లతో అమరావతిలో లోక్‌భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

రాజధాని అమరావతిలో లోకభవన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, రెండు గెస్ట్ హౌస్లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గం అంగీకారం లభించింది. ఎల్ 1 బిడ్లను ఆమోదించే బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీడ్ యాక్సిస్ రహదారిని 16వ జాతీయ రహదారికి అనుసంధానించే పనులకు రూ.532 కోట్ల మేర టెండర్లు పిలిచేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఎన్‌హెచ్ 16తో అనుసంధానించే ఇంటర్ చేంజ్, వంతెనలు, అండర్ పాస్‌లు - ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ తో ఈ-3 రోడ్ విస్తరణ పనులు రూ.532 కోట్లతో రెండేళ్లలో పూర్తి చేసేలా నిర్ణయం. ఈ మేరకు ఈ-3 రోడ్డు విస్తరణకు ఎల్ 1 బిడ్ ఆమోదానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీకి బాధ్యతలు అప్పగించారని మంత్రి పార్థసారథి తెలిపారు.

## సాంకేతిక విప్లవం దిశగా..

రాష్ట్రంలో సాంకేతిక విప్లవం కోసం ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ (ITE&C) రంగంలో మొత్తం 11 కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా, అమరావతిని దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చేయడంలో భాగంగా, అత్యాధునిక సాంకేతికతకు సంబంధించిన 7 క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చింది. క్వాంటం కంప్యూటర్లు తయారు చేయడం కోసం ముందుకు వచ్చిన పలు సంస్థల ప్రతిపాదనలకు, అలాగే క్వాంటం కంప్యూటింగ్‌లో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు. ఈ ప్రాజెక్టులను త్వరితగతిన నెలకొల్పేందుకు ప్రభుత్వం షరతులతో కూడిన రాయితీలను కల్పించేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది.

- రూ.9,514 కోట్లతో అమృత్-2 పెండింగ్ పనులు
- 506 పనులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రాజధాని అమరావతిలో కీలక ప్రాజెక్ట్‌లకు అనుమతి
- జాతీయ రహదారితో సీడ్ యాక్సెస్ రోడ్డు అనుసంధానం
- 7 క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- ఏడాదిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం
- రూ.5445 కోట్లతో పీఎం సూర్యఘర్ ప్రాజెక్ట్ అమలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రి పార్థసారథి




## పెట్టుబడులకు ఆమోదం

ఇటీవల రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఆమోదించిన పలు పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 సంస్థలకు సంబంధించి రూ.20,444 కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు. వీటి ద్వారా 56వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగనుందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇవికాక పరిశ్రమలు, వాణిజ్య శాఖ తరపున మొత్తం 14 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో మొత్తం రూ. 15,000 కోట్లకు పైగా పెట్టుబడులకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. తద్వారా సుమారు 1 లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. విద్యుత్ చార్జీలను రూ.5.12 నుంచి 4 రూపాయలకు తీసుకురావాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. దీని కోసం రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పలు సంస్థల ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించిందన్నారు.

ఇంధన రంగంలో భాగంగా, చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో M/s.Shreshtta Renewables Pvt. Ltd. సంస్థకు 10 TPD (టన్నులు ప్రతి రోజు) కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) కేటాయింపునకు మరియు ప్రోత్సాహకాల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద అనంతపురం జిల్లాలోని కనేకల్, బొమ్మనహాళ్ మండలాల్లోని గ్రామాల్లో 152 వీఔ విండ్, 148 MW AC/ 200 MWp DC సోలార్ సామర్థ్యంతో కూడిన 300 వీఔ విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు గనేకో త్రీ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. శ్రీసత్యసాయి జిల్లా మడకసిర, గుడిబండ మండలాల్లో 1700 MW AC / 2125 MWp DC సోలార్ పవర్ ప్రాజెక్ట్, ఎనర్జీ స్టోరేజ్ ఏర్పాటు కోసం చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తెట్టు రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీ-మోడల్ రైల్ కార్గో టెర్మినల్ ఏర్పాటుకు చెవూరు గ్రామంలోని 153.77 ఎకరాల భూమిని న్యూఢిల్లీకి చెందిన మెస్సర్స్ రామయపట్నం కార్గో రిసెప్షన్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

అటానమస్ మారిటైమ్ షిప్‌యార్డ్ స్థాపనకు ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, బోగోలు మండలం లోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో మొత్తం 29.58 ఎకరాల భూమిని (ఇందులో 7.58 ఎకరాలు వాటర్‌ఫ్రంట్ భూమి, 22.00 ఎకరాలు హార్బర్ భూమి) M/s. Sagar Defence Engineering Pvt. Ltd సంస్థకు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

నెల్లూరు జిల్లా నాయుడుపేటలో CIPSA TEC ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,140 కోట్ల పెట్టుబడితో హై-స్పీడ్ PCB(Printed Circuit Board) ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. విశాఖపట్నంలో 3 ఐటీ క్యాంపస్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా తక్షణమే 1,667 ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయి. పరిశ్రమలు, వాణిజ్య శాఖ తరఫున వచ్చిన 14 ప్రధాన పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ పచ్చజెండా ఊపింది.

తూర్పుగోదావరి జిల్లా కొమరగిరిలో ఇఫ్కో కిసాన్ సెజ్ లిమిటెడ్ సంస్థ 2,776 ఎకరాల్లో మల్టీ-ప్రోడక్ట్ సెజ్ అభివృద్ధికి రూ.870కోట్ల పెట్టుబడిని ఆమోదించింది. ఇది భవిష్యత్తులో అదనంగా రూ.9,400 కోట్ల సంభావ్య పెట్టుబడికి మార్గం సుగమం చేస్తుంది.

మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ALEAP - మహిళా మీవీజు ఇండస్ట్రియల్ పార్క్‌కు ఆమోదం లభించింది. రూ.22.48 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ పార్క్ మహిళలకు సుమారు 2,000 ఉద్యోగాలను సృష్టిస్తుంది.

రాష్ట్రాన్ని ప్రీమియం పర్యాటక గమ్యస్థానంగా మార్చేందుకు, విశాఖపట్నం, బాపట్ల మరియు తిరుపతి లో అంతర్జాతీయ బ్రాండెడ్ 5-స్టార్ హొటళ్లకు సం బంధించిన 4 ప్రధాన పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.784.39 కోట్ల పెట్టుబడి, 4,300కు పైగా ఉద్యోగాలు సృష్టించబడతాయి.

కృష్ణపట్నం పోర్టులో 4731 ఎకరాలు మల్టీ ప్రొడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం 2010లో ల్యాండ్ కొనుగోలు చేశారని, అయితే అక్టోబర్ 2019లో గత ప్రభుత్వం ఈ భూ కేటాయింపులను రద్దు చేసిందన్నారు. దీన్ని కోర్టు కొట్టి వేయడం వల్ల ప్రాజెక్టు పదేళ్లు ఆలస్యమైనందున పెనాల్టీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 3 ఏళ్లలో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించేందుకు సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు.

చిత్తూరు జిల్లా కుప్పంలో పాలార్ నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.15.96 కోట్ల నిధులను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 417 టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు పునర్నిర్మాణానికి కేబినెట్ ఓకే చెప్పింది.

మహిళల వన్డే ప్రపంచ కప్ గెలుపులో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారిణి శ్రీ చరణికి ప్రోత్సాహకం ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు, విశాఖపట్నంలో 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్థసారథి చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేల అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం కలిన బీసీ వినియోగదారులకు రూ.20 వేల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రూ.5445 కోట్ల అంచనా బడ్జెట్‌తో పీఎం సూర్యఘర్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.

రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ విషయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సీఎం తెలిపారన్నారు. ఏడాది కాలంలోనే రెవెన్యూ సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని రెవెన్యూ విభాగాన్ని సీఎం ఆదేశించారని తెలిపారు. 22 ఏ, మ్యుటేషన్, రీ సర్వే సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని.. ఆపై రెవెన్యూ రికార్డులన్నింటినీ బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్‌లో సేవ్ చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. తద్వారా రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

హోం శాఖ తరపున, పాత చట్టాల స్థానంలో కొత్తగా 'ది ఆంధ్ర ప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ ఆక్ట్, 2025' ముసాయిదా బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టడానికి ఆమోదం లభించిందని మంత్రి పార్థసారథి తెలిపారు.

# ఏపీలో చంద్రబాబు పాలన భేష్

- భారీ పెట్టుబడులతో అభివృద్ధి పరుగులు
- జగన్ పార్టీ విమర్శలకు దీటుగా బదులివ్వాలి
- బీజేపీ ఎంపీలతో ప్రధాని మోదీ




న్యూఢిల్లీ (చైతన్యరథం): ఏపీలో సీఎం చంద్రబాబు పాలనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు పాలన భేష్ అంటూ కితాబిచ్చారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వస్తోందని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీలో చంద్రబాబు పాలన చాలా బావుందని ప్రశంసించారు. పెట్టుబడులు కూడా ఏపీకి ఎక్కువగా వస్తున్నాయని, ఇది అభివృద్ధికి మంచి సూచిక అని ప్రధాని అన్నారు. ఇది శుభపరిణామమన్నారు. రాబోయే రోజుల్లో ఏపీ చాలా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రధాని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి చక్కటి సమన్వయంతో ముందుకు సాగడం మంచి పరిణామమన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు బీజేపీ కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు.

ఏపీలో పాలనను పొగడ్తలతో ముంచెత్తిన ప్రధాని.. తెలంగాణ బీజేపీ ఎంపీలపై మాత్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సరైన ప్రతిపక్ష పాత్ర పోషించలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు మరింత చురుగ్గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

# నేడు విశాఖకు సీఎం చంద్రబాబు

- కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు శంకుస్థాపన
- హాజరుకానున్న విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్
- రూ.1,583 కోట్ల పెట్టుబడి, 8వేల మందికి ఉపాధి
- వెయ్యి సీటింగ్ కెపాసిటీతో తాత్కాలిక క్యాంపస్‌లో కార్యకలాపాలు
- నేడు లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి లోకేష్
- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపైనా ముఖ్యమంత్రి సమీక్ష




అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ పాలనలో ఐటీ కేంద్రంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా వెయ్యి మంది సీటింగ్ కెపాసిటీతో తాత్కాలిక క్యాంపస్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించను న్నారు. అనంతరం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకూ 9 జిల్లాల సమగ్ర అభివృద్ధి రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ ఇతర అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించనున్నారు. 9 జిల్లాల అధికారులు, మంత్రులు ప్రజాప్రతినిధులు, నిపుణులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

**రూ.1,583 కోట్ల పెట్టుబడి, 8వేల మందికి ఉపాధి**

విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాలను కాగ్నిజెంట్ సంస్థకు కేటాయించారు. ఇందులో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఐటీ క్యాంపస్‌ను మూడు దశల్లో నిర్మించనున్నారు. విశాఖలో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు కాగ్నిజెంట్ సంస్థ రూ. రూ.1,583 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. కాగ్నిజెంట్ ప్రతిపాదిత నూతన క్యాంపస్ 2033 నాటికి మూడు దశల్లో నిర్మించనుంది. 2029 నాటికి మొదటి దశను పూర్తిచేసి 3వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. అనంతరం రెండు దశల ద్వారా ఉద్యోగ అవకాశాలను 8 వేలకు పెంచనుంది. మొదటి దశ పూర్తయ్యే వరకు తాత్కాలికంగా రుషికొండ ఐటీ పార్క్ హిల్-2పై మహతి ఫిన్ టెక్ భవనంలో కార్యకలాపాలను కొనసాగించనుంది. ఈ కేంద్రం కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై దృష్టి సారిస్తుంది.

# ఏపీలో పెట్టుబడిదారులకు అత్యుత్తమ ప్రోత్సాహకాలు

- ఏపీకి వచ్చేలా కెనడా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- సీఐబీసీ ప్రెసిడెంట్ విక్టర్ థామస్‌కు మంత్రి లోకేష్ వినతి



టొరంటో/కెనడా (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేలా కెనడియన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కెనడా – ఇండియా బిజినెస్ కౌన్సిల్ (సీఐబీసీ) ప్రెసిడెంట్ విక్టర్ థామస్‌ను విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. కెనడా పర్యటనలో ఐదో రోజు సీఐబీసీ) ప్రెసిడెంట్ విక్టర్ థామస్‌తో మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏఐ, క్వాంటమ్ వంటి భవిష్యత్ సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. తూర్పుతీరంలో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారింది. ఇటీవల గూగుల్ సంస్థ విశాఖపట్నంలో ఏఐ హబ్, డాటా సెంటర్ పై 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఇది భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డిఐ గా ఉంది. సెమీ కండక్టర్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు ఏర్పాటు చేసే సంస్థలకు ఏపీలో అత్యుత్తమ ప్రోత్సాహకాలను అందిస్తున్నాం. అమరావతి రాజధానిలో రూ.65 వేల కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. విమానాశ్రమయాలు, పోర్టులు, లాజిస్టిక్స్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టేందుకు కెనడియన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిందిగా లోకేష్ విజ్ఞప్తి చేశారు.

సీఐబీసీ ప్రెసిడెంట్ విక్టర్ థామస్ మాట్లాడుతూ... కెనడా–ఇండియా బిజినెస్ కౌన్సిల్ ఇరుదేశాల నడుమ వాణిజ్యం, పెట్టుబడులను పెంచడం, భాగస్వామ్యాలను సులభతరం చేసేందుకు వారధిగా పనిచేస్తుందన్నారు. ఆర్థిక, సాంకేతికత, విద్యుత్, వ్యవసాయం తదితర రంగాల్లో మార్కెట్ లీడర్లను గుర్తించి నెట్‌వర్కింగ్ ద్వారా ప్రభుత్వాలకు సలహాలు ఇవ్వడంపై దృష్టి సారిస్తుంది. రెండు దేశాల మధ్య ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే దీని లక్ష్యం. ఉన్నత స్థాయి ఫోరమ్‌లు, వ్యాపార మిషన్‌లు, నిపుణులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి ఇరుదేశాల్లో ఉన్న అవకాశాలను వివరిస్తాం. ముఖ్యంగా ఎస్ఎంఈలకు భారతీయ మార్కెట్‌లో పెరుగుతున్న అవకాశాలను నావిగేట్ చేయడంలో సహకరిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామికాభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని విక్టర్ థామస్ పేర్కొన్నారు.

## కాగ్నిజెంట్, సత్వాతో పాటు విశాఖలో..

# మరో 7 ఐటీ సంస్థలకు నేడు భూమిపూజ

- శంకుస్థాపన శిలా ఫలకాలను ఆవిష్కరించనున్న మంత్రి లోకేష్
- 3,740 కోట్ల మేర ఐటీ సంస్థల పెట్టుబడి
- 41,700 మందికి ఉద్యోగావకాశాలు



అమరావతి (చైతన్యరథం): ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ కాగ్నిజెంట్, రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్‌తో పాటు విశాఖపట్నంలో మరో 7 ఐటీ సంస్థల క్యాంపస్‌ల నిర్మాణాలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం భూమిపూజతో పాటు భూమిపూజ శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. విశాఖ మధురవాడలో 1.టెక్ తమ్మిన (Tech Tammina..Sree Tammina Software Solutions Pvt. Ltd), 2. నాన్‌రెల్ టెక్నాలజీస్ (Nonrel Technologies Private Limited), 3. ఏసీఎన్ ఇన్ఫోటెక్ (ACN HealthCare RCM Services Pvt Ltd), (కాపులుప్పాడలో.) 4. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (Imaginnovate Techsolutions (India) Pvt Ltd), 5. ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ (Fluentgrid Limited), 6. మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (Motherson Technology Services Limited), 7.క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్(Quarks Technosoft Pvt Ltd) సంస్థలకు శంకుస్థాపనతో పాటు శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. కాగ్నిజెంట్ సహా ఈ ఐటీ సంస్థలు రూ.3,740 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నాయి. 41,700 మందికి ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయి.

### 1.టెక్ తమ్మిన

విశాఖ మధురవాడలోని ఎస్పీఎల్-4, హిల్ నెం-2లో ఏర్పాటు కానున్న టెక్ తమ్మిన సంస్థ రూ.62 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 500 మందిగి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం అమెరికాలో ఉంది. నెదర్లాండ్స్, దుబాయ్, ఇండియాలో తన సేవలను అందిస్తోంది.

### 2. నాన్ రెల్ టెక్నాలజీస్

విశాఖ నాన్ ఐటీ సెజ్, హిల్ నెం-2లో ఏర్పాటుకానున్న నాన్ రెల్ టెక్నాలజీస్ సంస్థ రూ.50.60 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 567 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

### 3.ఏసీఎన్ ఇన్ఫోటెక్

విశాఖ ఐటీ సెజ్ హిల్ నెం-2లో ఏర్పాటు కానున్న ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్‌సీఎం సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.30 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ 12 నెలల్లో తన వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది.

### 4. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్

విశాఖ భీమిలిలోని కాపులుప్పాడలో ఏర్పాటుకానున్న ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ రూ.140 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2,600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

### 5. ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్

కాపులుప్పాడలో ఏర్పాటు కానున్న ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

### 6. మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్

కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్క్‌లో ఏర్పాటుకానున్న మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ రూ.109.73 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 1,775 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

### 7. క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్

విశాఖ కాపులుప్పాడలో ఏర్పాటు కానున్న క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.115 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

# విశాఖలో సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్

**- నేడు మంత్రి లోకేష్ శంకుస్థాపన**

**- రూ.1,500 కోట్ల పెట్టుబడి, 25 వేల మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు**




అమరావతి (చైతన్యరథం): దేశంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్, కన్సల్టింగ్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో విశాఖ మధురవాడలోని హిల్-4లో నూతనంగా నిర్మించనున్న సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ వేడుకకు పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు హాజరుకానున్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ క్యాంపస్ ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పరోక్షంగా 40 వేల నుంచి 50 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. టెక్నాలజీ, ఇన్నోవేషన్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ సెంటర్‌గా విశాఖపట్నం రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో సత్వా గ్రూప్ పెట్టుబడులు మరింత బలాన్ని చేకూర్చనున్నాయి. రూ.1,500 కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకుంటున్న సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్‌లో గ్లోబల్ ప్రమాణాల గ్రేడ్-ఏ కార్యాలయాలు, ప్రీమియం నివాసాలు, ఇంటిగ్రేటెడ్ రిటైల్, హాస్పిటాలిటీ సౌకర్యాలు, స్మార్ట్ మొబిలిటీ, పునరుత్పత్తి శక్తి సమీకరణ, పట్టణ జీవన విధానానికి అనుగుణంగా ESG ఆధారిత మౌలిక వసతులు కల్పించనున్నారు. సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్ ఏపీ తీర ప్రాంతంలోని అతిపెద్ద భవిష్యత్ ఉపాధి కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది.

1986లో సత్వా గ్రూప్‌ను నెలకొల్పారు. దేశ ఆధునిక రియల్ ఎస్టేట్, టెక్నాలజీ మౌలిక సదుపాయాల రూపకల్పనలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్, ముంబై నగరాల్లో ఇప్పటి వరకు 78 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణాలను పూర్తిచేసింది. మరో 71 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణాలు అభివృద్ధి దశలో ఉన్నాయి. విశాఖలో మొదటి మూడేళ్లలో ఒక మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను సత్వా సంస్థ అభివృద్ధి చేయనుంది. అదేవిధంగా వచ్చే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను విశాఖలో అభివృద్ధి చేయనుంది. ప్రతిభా సమృద్ధి, ఆర్థిక వేగం, పురోగామి పాలన కలిగిన అధిక వృద్ధి సామర్థ్య మార్కెట్లలో ఈ గ్రూప్ వ్యూహాత్మకంగా తన విస్తరణను కొనసాగిస్తోంది.

**రిటైల్ రంగంలో ఉత్పాదకత పెంచేలా**

# ఏఐ సాంకేతికత వినియోగం



**- పట్టణ ఎస్‌హెచ్‌జీ మహిళల కోసం పుచ్ ఏఐతో ఒప్పందం**

**- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు వెల్లడి**

అమరావతి (చైతన్యరథం): పట్టణ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళల కోసం పుచ్ ఏఐ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పుచ్ ఏఐ తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసిందన్నార. రిటైల్ రంగంలో పనిచేస్తున్న పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పాదకతను పెంచడానికి రూపొందించిన ఏఐ సొల్యూషన్లను అమలు చేయడం ఒప్పందం లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.

# 13 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ల నియామకం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని 13 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 10 టీడీపీ, 2 జనసేన, ఒకటి బీజేపీకి కేటాయించారు. ప్రకాశం జిల్లాలో కొంత కాలం క్రితం హత్యకు గురైన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి భార్యను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించారు.

| | | |
|---|---|---|
| *శ్రీకాకుళం* | : | *పీరికట్ల విఠల్రావు(టీడీపీ)* |
| *విజయనగరం* | : | *డొక్కాడ రామకృష్ణ (టీడీపీ)* |
| *విశాఖపట్నం* | : | *వన్నంరెడ్డి సతీష్ కుమార్ (జనసేన)* |
| *తూర్పుగోదావరి* | : | *భూపతిరాజు ఈశ్వర్ రాజు వర్మ(టీడీపీ)* |
| *పశ్చిమగోదావరి* | : | *జుత్తిగ నాగరాజు(జనసేన)* |
| *కృష్ణా* | : | *ఎంఎస్ బేగ్ (టీడీపీ)* |
| *గుంటూరు* | : | *వందనాదేవి (టీడీపీ)* |
| *ప్రకాశం* | : | *సుచిత్ర ముప్పవరపు- (టీడీపీ)* |
| *నెల్లూరు* | : | *శాంత కుమారి (టీడీపీ)* |
| *చిత్తూరు* | : | *రెడ్డివారి గురవారెడ్డి(టీడీపీ)* |
| *కడప* | : | *భానుప్రకాశ్ దాసరి (బీజేపీ)* |
| *కర్నూలు* | : | *తుగ్గలి నాగేంద్ర(టీడీపీ)* |
| *అనంతపురం* | : | *వద్దే వెంకట్ (తెదేపా)* |

# విశాఖలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం

**- పార్టీ కార్యాలయంలో అర్జీలు స్వీకరణ**

విశాఖపట్నం (చైతన్యరథం): అమెరికా, కెనడా పర్యటన పూర్తి చేసుకొని విశాఖ చేరుకున్న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్‌కు గురువారం రాత్రి విమానాశ్రయం మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుండి విశాఖ లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న మంత్రి లోకేష్.. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.















## నాటి పంతులమ్మ... నేటి రాష్ట్ర హోంమంత్రి!

# చంద్రబాబునాయుడు వద్ద...
# నేను ఎప్పటికీ స్టూడెంట్ నే!



వంగలపూడి అనిత,
హోం మంత్రి



(చైతన్యరథం ప్రతినిధి - అమరావతి)

తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా అధినేతలపై నోరుజారే రాజకీయ ప్రత్యర్థులపై శివంగిలా విరుచుపడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ లీడర్‌గా పేరొందారు వంగలపూడి అనిత. 2019-24 నడుమ తెలుగుమహిళ అధ్యక్షురాలుగా మహిళా సమస్యలపై గళమెత్తుతూ రాజీలేని పోరాటం చేసి అధికార వైసీపీకి చుక్కలు చూపించారు. విశాఖ జిల్లా ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెంలో సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన అనిత... స్కూలు టీచర్‌గా పనిచేస్తూ రాజకీయాల్లోకి వచ్చి ఒక్కో మెట్టు ఎదుగుతూ రాష్ట్ర హోంమంత్రి స్థాయికి చేరారు. కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకునే మహిళలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు. ఆమె రాజకీయ ప్రయాణం నేటి మహిళా లోకానికి స్ఫూర్తిదాయకం. రాష్ట్రానికి హోంమంత్రినైనా చంద్రబాబు గారి వద్ద తాను నిత్య విద్యార్థినినేని, ఆయన మార్గదర్శకత్వంలో పనిచేయడం ఆనందంగా ఉందంటున్న వంగలపూడి అనిత అంతరంగం ఆమె మాటల్లోనే...

### నాన్న వద్ద క్రమశిక్షణ నేర్చుకున్నా!

యలమంచిలి గర్ల్స్ హైస్కూలులో 8,9,10 తరగతులు పూర్తిచేశాక... నాన్న వంగలపూడి అప్పారావుగారు చోడవరం జూనియర్ కాలేజీలో లెక్చరర్ కావడంతో నన్ను ఇంటర్మీడియట్ అక్కడ చేర్చారు. కాలేజీలో స్ట్రిక్ట్ లెక్చరర్ గా పేరొందిన ఆయన ఇంట్లో నన్ను అంతకంటే ఎక్కువ క్రమశిక్షణతో పెంచారు. యూనిఫాం ధరించడం, సమయానికి కాలేజీకి వెళ్లడం, అటెండెన్స్ విషయంలో కఠినంగా వ్యవహరించే వారు. నన్ను మిగతా విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని చెప్పేవారు. ఆయన నేర్పిన క్రమశిక్షణ ఆ తర్వాత జీవితంలో నాకు ఎంతగానో ఉపయోగపడింది. భీమవరంలో బి.ఇడి పూర్తిచేశాక పాయకరావుపేట నియోజకవర్గం పాల్తేరు, వెంకటనగరం గ్రామాల్లో స్కూలు టీచర్ గా పనిచేశాను. చంద్రబాబు గారి విజనరీ లీడర్ షిప్ తో స్ఫూర్తి పొందిన నేను 2012లో టీచర్ వృత్తి వదిలేసి రాజకీయాల్లోకి వచ్చాను. 2014లో పాయకరావుపేట నుంచి అవకాశం ఇవ్వడంతో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. 2019లో కొవ్వూరు నుంచి అవకాశమిచ్చినా అక్కడి పరిస్థితులపై అవగాహన లేక ఓటమి పాలయ్యాను. ఆ తర్వాత నాకు మళ్లీ నాకు సొంత నియోజకవర్గం బాధ్యతలు ఇచ్చారు. 2024 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి గెలిచిన నాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన హోంమంత్రిగా అవకాశమిచ్చారు.



### హోంమంత్రి పదవిలో కంఫర్ట్ గా ఉన్నారా?

మిగిలిన అన్నిశాఖల కంటే హోం మంత్రి బాధ్యత అత్యంత కీలకమైంది, గౌరవనీయమైంది. ఒకరకంగా చెప్పాలంటే కత్తిమీద సాములాంటిది. అనునిత్యం రాష్ట్రంలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంటుంది. ఎంత పారదర్శకంగా వ్యవహరిస్తున్నా ప్రతిపక్షం ప్రతి ఘటనను రాజకీయం చేస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. వీటన్నింటికీ మించి చంద్రబాబు గారి వద్ద పనిచేయడమంటే అనునిత్యం మాకు పరీక్షే. ఆయన వద్ద నాలాంటి మంత్రులందరం నిత్య విద్యార్థులమే. ఎంత పనిచేసినా ఆయన వద్దకు సమీక్షకు వెళితే మళ్లీ కొత్తగానే ఉంటుంది. బాబు గారి పరిపాలనా దక్షత, సమయస్ఫూర్తితో తీసుకునే నిర్ణయాలు... అత్యంత కఠినమైన పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు సాగేలా ప్రేరణనిస్తాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సలహాలు, యువనేత లోకేష్ ప్రోత్సాహంతో సమర్థవంతంగా నా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను.

## లీడర్ వాయిస్

### మహిళల భద్రతకు ఏం చర్యలు తీసుకున్నారు?

మహిళల భద్రత విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారు మాకు బాధ్యతలు చేపట్టిన తొలిరోజు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చిన్నపిల్లలు, మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి కొన్ని సంఘటనల్లో మేం తీసుకునే చర్యలకు భయపడి చాలా మంది నిందితులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు మీరు చూస్తూనే ఉన్నారు. కడపలో ఒక చిన్నారిని అత్యాచారం చేసి చంపిన కేసులో నిందితుడి గురించి పలు కోణాల్లో విచారణ చేపట్టాం. విషయం తెలుసుకున్న నిందితుడు దగ్గరలో ఉన్న చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదేవిధంగా తునిలో విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకుని సూసైడ్ చేసుకున్నాడు. ఇలాంటి సందర్భాలు ఎన్నో కనిపిస్తున్నాయి. మహిళల జోలికి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేవరకు వదిలిపెట్టరు. ఈ నేపథ్యంలో చట్టాలను కూడా కఠిన తరం చేశాం. మహిళలు ఎక్కడ ఉన్నా భద్రంగా ఉండే పరిస్థితులను కల్పించడం మా బాధ్యత.

### సోషల్ మీడియా కేసుల్లో ఎలా వ్యవహరిస్తున్నారు?

ప్రస్తుతం కీలకంగా మారిన సోషల్ మీడియా దారితప్పి అవమానాలకు, వ్యక్తిగత దూషణలకు వేదికగా మారుతోంది. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ఎవరు విమర్శించినా, వెంటనే వారిని టార్గెట్ చేసి దిగజారి వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. మాతల్లి లాంటి భువనేశ్వరి మేడమ్, నాతో సహా ఎంతోమంది మహిళలను అత్యంత జుగుప్సాకరమైన భాషతో తీవ్ర అవమానాలకు గురిచేశారు. మహిళలమని కూడా చూడకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు. హైకోర్టు న్యాయమూర్తుల నుంచి, అమరావతి మహిళల వరకు అందరం సోషల్ మీడియా బాధితులమే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసభ్యకరమైన పదాలతో పోస్టులు పెట్టేవారిని కట్టడి చేయాలని నిర్ణయించాం. కఠినమైన పనితీరుతో చాలావరకు నియంత్రించగలిగాం. తప్పుడు పోస్టులు పెట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఉప సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. అయితే గతంలో ప్రజలకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండేది కాదు. మా ప్రభుత్వం వచ్చాక ప్రజలు నేరుగా వచ్చి ధైర్యంగా తమ సమస్యలు చెప్పుకోగలుగుతున్నారు. అటువంటి మంచి వాతావరణం కల్పించడం హోంమంత్రిగా నాకు సంతృప్తిగా ఉంది.

### ప్రస్తుతం శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉంది?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో క్రైమ్ రేటు గణనీయంగా తగ్గింది. సుమారు 5.7 శాతపు తగ్గుదల నమోదైంది. విజిబుల్ పోలీసింగ్, స్మార్ట్ పోలీసింగ్ టెక్నాలజీలు (మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్లు, ఏఐ ఆధారిత పర్యవేక్షణ), విస్తృత సీసీటీవీ నెట్‌వర్క్, ఈగల్ టీంలు, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్లు, సముదాయ పోలీసింగ్‌తో పాటు పోలీస్-ప్రజల భాగస్వామ్యం వ్యవస్థను పెంచడం ద్వారా భౌతిక, ఆర్థిక, నేరాలపై నియంత్రణ క్రైమ్ రేటు తగ్గడానికి ప్రధాన కారణాలు. కఠిన కేసుల విషయంలో వేగవంతమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, త్వరితగతిన చార్జిషీటు దాఖలు నేరాల సంఖ్య తగ్గుదలకు దోహదపడ్డాయి. ఈ చర్యల ఫలితంగా హింసాత్మక నేరాలు, గృహనేరాలు, ఆర్థిక నేరాల కొన్ని శ్రేణుల్లో భారీగా తగ్గుదల కనిపించింది. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా పూర్తిగా రూపుమాపే దిశగా మేము ఆపరేషన్ డ్రగ్-ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌ను ఆరంభించాం. రాష్ట్ర సరిహద్దులు, పోర్టులు, ఇండస్ట్రియల్ జోన్లు, కాలేజీల వద్ద కఠిన తనిఖీలు నిర్వహించేలా స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. డ్రగ్స్, అక్రమ గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టి, యువతను డ్రగ్స్ ప్రభావం నుండి రక్షించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ టీమ్ ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్ ద్వారా 24x7 అర్జెంట్ సపోర్ట్ ప్లాట్‌ఫారమ్ అందుబాటులోకి తెచ్చాం. ప్రమాదంలో ఉన్న మహిళల లైవ్ లోకేషన్ నేరుగా కంట్రోల్ రూమ్‌కి చేరి, సమీపంలోని పెట్రోలింగ్ టీమ్ వెంటనే స్పందించేలా మేము వ్యవస్థను బలోపేతం చేశాం.








# ఉర్దూ అకాడమీ 50 ఏళ్ల ఉత్సవాలు

**పోస్టర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు - పాల్గొన్న న్యాయ, మైనారిటీ మంత్రి ఫరూక్**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఆవిర్భ వించి 50 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గురువారం రాత్రి ఆవిష్కరించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ముఖ్యమంత్రిని న్యాయ శాఖ మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ కలిశారు. ఉర్దూ అకాడమీ ఏర్పడి 50 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ పేరుతో నిర్వ హిస్తున్న వారోత్సవ కార్యక్రమాల వివరాలను సీఎంకు వివరించా రు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించి ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూ ను ద్వితీయ భాషగా మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికాబద్ధమైన చర్యలను ప్రజలకు వివరించేందుకు వారోత్సవ నిర్వహణ ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ షుబ్లీ ముఖ్యమంత్రికి వివరించారు. స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ షుబ్లీకి సీఎం చంద్రబాబు సూచించారు.

# పవన్‌కళ్యాణ్‌ను కలిసిన మంత్రులు

**రోడ్లకు నిధుల మంజూరుపై ధన్యవాదాలు**





అమరావతి(చైతన్యరథం): క్యాబినెట్ సమావేశానికి ముందు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను పలువురు మంత్రులు కలిశారు. తమ నియోజకవర్గ గ్రామాల్లోని రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రోడ్లతో ప్రజలు చాలా అవస్థలు పడ్డారని.. ఆ రోడ్లు ఇప్పుడు బాగుపడతాయని హర్షం వ్యక్తం చేశారు. పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, నారాయణ, నాదెండ్ల మనోహర్, సవిత, స్వామి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్ ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. మొదటి విడతగా పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తూ ఇప్పటికే ఆ శాఖ జీవో జారీ చేసింది. మొత్తంగా 157 నియోజకవర్గాల్లో 1299 రోడ్ల పటిష్టతకు చర్యలు చేపట్టనుంది. రూ.2123 కోట్ల మేర సాస్కీ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 26 జిల్లాల పరిధిలోని 157 నియోజకవర్గాల్లోని 4007 కిలోమీటర్ల మేర రోడ్ల ను పటిష్టపరిచేలా మొదటి విడతలో కార్యాచరణ రూపొం దించా రు. పల్లె పండుగ 2.0 పేరిట చేపట్టే రహదారి నిర్మాణా లకు ఇటీవలే శంకుస్థాపన చేశారు.

# ఏపీ హస్తకళలకు మరింత ప్రోత్సాహం

- **రాష్ట్ర కళాకారులకు అవార్డులు హర్షణీయం**
- **శ్రీకాళహస్తిలో వారికి సన్మానం నిర్వహిస్తాం**
- **100 మందికి టూల్ కిట్లు కూడా ఇస్తాం**
- **చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో హస్త కళలకు మరింత ప్రోత్సాహమందివ్వనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జాతీయ హస్త కళల వారోత్సవాల్లో భాగంగా రెండ్రోజుల కిందట ఢిల్లీలో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ 2023, 2024కు సంవత్సరాలకు సంబంధించి ప్రకటించిన అవార్డుల్లో ఏపీకి చెందిన ఐదుగురు హస్త కళాకారులు అవార్డులు అందుకోవ డంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుn నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఈ అవార్డులు ఏపీకి వరించాయన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రక టన విడుదల చేశారు. జాతీయ హస్త కళల వారోత్సవాలు (డిసెంబర్ 8-14) సందర్భంగా భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ 2023, 2024కు సంవత్సరాలకు సంబంధించి అవార్డులు ప్రకటించింది. ఏపీకి 2023 సంవత్సరానికి రెండు అవార్డులు, 2024 సంవత్సరానికి ఒక అవార్డుతో పాటు రెండు ప్రత్యేక ప్రస్తా వన అవార్డులు లభించాయి. 2023కు సంబంధించి, మహిళల విభాగంలో శ్రీకృష్ణ చరిత తోలు బొమ్మల తయారీలో డి.శివమ్మకు శిల్ప గురు అవార్డు లభించింది. కలంకారి హ్యాండ్ పెయింటింగ్ లో విజయలక్ష్మిని జాతీయ హస్తకళ అవార్డు వరించింది. 2024కు సంబంధించి ఏటికొప్పాక బొమ్మల తయారీలో గోర్సా సంతోష్‌కు జాతీయ అవార్డు, తోలు బొమ్మల తయారీలో కందాయ్ అంజన ప్పకు, క్రాఫ్ట్‌లో తోలుబొమ్మల తయారీ విభాగంలో ఖండే హరనాథ్ కు ప్రత్యేక ప్రస్తావన అవార్డులు వరించాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కళాకారులకు శిక్షణతో పాటు ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ సదుపాయం, ఆర్థిక భరోసాతో కూడిన గౌరవ ప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. అవార్డులు అందుకున్న కళాకారులకు అభినందనలు తెలిపారు. జాతీయ అవార్డులు అందిన స్ఫూర్తితో హస్త కళలకు మరింత ప్రాచుర్యం కల్పించేలా కృషి చేస్తామన్నారు. అవార్డు గ్రహీతలకు ఈ నెల 13న శ్రీకాళహస్తిలో సన్మానించనున్నట్లు తెలిపారు. జాతీ య హస్తకళల వారోత్సవాల్లో భాగంగా ఈ సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే కార్యక్రమంలో వంద మంది హస్త కళాకారులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల విలువ చేసే టూల్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# ఈహెచ్‌ఎస్ వైద్యసేవలపై ఉన్నతస్థాయి కమిటీ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేప ట్టింది. ఈహెచ్‌ఎస్ కార్డుల ద్వారా వైద్య సేవల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం సహా, మెరుగైన సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం కోసం ఏడుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని నియమిం చింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉన్నత స్థాయి కమిటీని నియామిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా జీఏడీ, ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల ముఖ్య కార్యదర్శులు, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోషి యేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. కమిటీ సభ్యుడు, కన్వీనర్‌గా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోనూ నియమించారు. ఈహెచ్‌ఎస్ కార్డుల ద్వారా మెరుగ్గా వైద్య సేవలు అందించే అంశంపై అధ్యయనం చేయాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. 8 వారాల్లో అధ్యయన నివేదికను రాష్ట్రప్రభుత్వానికి అందించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవోను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

# పిన్నెల్లి సోదరులకు రిమాండ్



మాచర్ల (చైతన్యరథం): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి మాచర్ల కోర్టు రిమాండ్ విధించింది. టీడీపీ నేతల జంట హత్యల కేసులో మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వారిద్దరూ గురువారం లొంగిపోగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. ఈ ఏడాది మే 24న పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు జవ్విశెట్టి వెంకటేశ్వరరావు, జవ్విశెట్టి కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. ఈ కేసులో పిన్నెల్లి సోదరులపై కేసు నమోదైంది. ఏ6, ఏ7గా వారిని చేర్చారు. వీరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయటంతో సుప్రీంకోర్టుకు వెళ్లినా ఫలితం దక్కలేదు. రెండు వారాల్లో లొంగిపోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో పిన్నెల్లి సోదరులు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు.

# విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

**ఆసుపత్రికి చేర్చి రక్షించిన 108 సిబ్బంది**

తణుకు(చైతన్యరథం): అత్తిలి శివాలయం సమీపంలో మానసి క రోగి 26 ఏళ్ల రమేష్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో సుమారు 40 శాతం కాలిన గాయాలు అయ్యాయి. షాక్ కారణంగా 6 అడుగుల ఎత్తు నుంచి పడిపోయాడు. సమాచారం అందు కున్న అత్తిలి ఏఎల్‌ఎస్ అంబులెన్స్ 12 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 34 నిమిషాల్లో సురక్షితంగా తరలించింది. ఈఎంటీ సతీష్‌కుమార్ యాదల, పైల ట్ కె.మహేష్ జాగ్రత్తగా సమన్వయం చేస్తూ అత్యవసర చికిత్సను అందించారు. అత్యవసర పరిస్థితిలో 108 సిబ్బంది చురుకైన చర్యలతో కేవలం నిమిషాల వ్యవధిలో రోగిని ఆసుపత్రికి చేరు స్తూ ప్రాణాలను రక్షించారు. ఈ సమర్థవంతమైన సమన్వయం అత్యవసర వైద్యసేవల్లో ప్రాణాలు నిలబెట్టింది. అంబులెన్స్ టీమ్ తక్షణ స్పందన ప్రాణాపాయం నుంచి బయటపడేసింది.

# రాయచోటిలో పీఆర్ రోడ్లకు మహర్దశ

- 12 గ్రామీణ రహదారులు మంజూరు
- రూ.21.16 కోట్లతో నిర్మాణానికి చర్యలు
- పవన్‌కు మంత్రి మండిపల్లి కృతజ్ఞతలు



రాయచోటి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ రూపు రేఖలు మార్చేందుకు రోడ్లను మంజూరు చేసిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ గారికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో మొత్తం 38.08 కిమీ మేరకు 12గ్రామీణ రహదారులకు రూ.21.16 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ మంజూరు చేసింది. రహదారుల మంజూరుకు కృతజ్ఞతలు చెప్పేందుకు మంత్రి మండిపల్లి అమరావతిలో పవన్‌కళ్యాణ్‌ను హోంమంత్రి అనిత తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ రోడ్ల నిర్మాణం ద్వారా రాయచోటిలో గ్రామీణ రవాణా సౌకర్యాలు, అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురానుందని మంత్రి తెలిపారు.

# పోలవరం గ్రామాలకు 7.40 కోట్లు

### రోడ్ల నిర్మాణానికి విడుదల చేసిన పవన్

అమరావతి (చైతన్యరథం): పోలవరం మండలంలోని ఐదు గ్రామాలకు చెందిన రహదారుల సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గురువారం స్పందించారు. ఈ ఐదు గ్రామాలు.. గవరవరం, గంగన్నగూడెం, తిమ్మన కుంట, కృష్ణంపాలెం ఏడు వాడలపాలెం రహదారుల నిర్మాణం కోసం రూ.7.40 కోట్ల నిధులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంజూరు చేశారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల పవన్‌కళ్యాణ్ ద్వారకా తిరుమల సమీపంలోని ఐ.ఎస్ జగన్నా ధపురంలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి రహదారుల నిర్మాణం అంశాన్ని గ్రామస్తులు తీసుకు వెళ్లారు. దీంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారు.

# జగన్‌రెడ్డి పాలనలో డ్రగ్స్ సామ్రాజ్యం

- యువతను తప్పుదారి పట్టించారు
- సరఫరా చేసే ముఠాను సమర్థిస్తున్నారు
- టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే.. ప్రతిపక్ష నేత జగన్‌రెడ్డి మతిలేని ఆరోపణలతో ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని టీడీపీ అధికారి ప్రతినిధి మేడా విజయ శేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారంపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిం చిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-24 మధ్య ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారు. నకిలీ మద్యాన్ని ఏరులై పారించారు. గంజాయి, డ్రగ్స్‌ను కాలేజీ లు, యూనివర్సిటీలకు సరఫరా చేయించింది జగన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో విజయవాడ, కాకినాడ, రాజమండ్రి వంటి నగరాల్లో వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడితే వాటిపై వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందో జగన్ సమాధానం చెప్పాలన్నారు. అప్పట్లో రాష్ట్రంలో డ్రగ్స్ సామ్రాజ్యాన్ని నిర్మించి ఇతర రాష్ట్రాలు, దేశాలకు సరఫరా చేయించింది వైసీపీ కాదా అని నిలదీశారు. వైసీపీ విద్యార్థి విభాగం నాయకుడు కొండారెడ్డి డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్‌కు పట్టుబడితే 'ఏదో చిన్న పిల్లాడు, తెలియక చేశాడు' అని జగన్ మాట్లాడటం విడ్డూరమన్నారు. వేల కోట్ల గంజాయి, డ్రగ్స్ దందాలో కొండారెడ్డి వాటా లేదా? కాలేజీలు, యూనివర్సిటీల్లో వేలాది మంది విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేయించింది ఆయన కాదా అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో డ్రగ్స్, కల్తీ నెయ్యి వ్యవహారాలతో పాటు అన్ని వ్యవస్థలను నాశనం చేశారని విమర్శించారు. చంద్రబాబు యువతను సాఫ్ట్‌వేర్ వైపు, అభివృద్ధి వైపు నడిపిస్తుంటే.. జగన్‌రెడ్డి గంజాయి, డ్రగ్స్ వైపు మళ్లిస్తున్నారని విమర్శించారు. ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని గమనించాలని కోరారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారని తెలిపారు. జగన్‌రెడ్డి తన నోటిని అదుపులో పెట్టుకోవాలని, వైసీపీ చేసిన అరాచకాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.

# పత్తిరైతులను కేంద్రం ఆదుకోవాలి

### - లోక్‌సభలో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు



న్యూఢిల్లీ (చైతన్యరథం) మొంథా తుపాను వల్ల తీవ్రంగా నష్టపోయిన పత్తి రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీపీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. రంగు మారిన, తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని సీసీఐ కొనేలా చూడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 18లక్షల ఎకరాల్లో పత్తి పంట తీవ్రంగా ప్రభావితమైంది. పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 1.25 లక్షల టన్నుల పత్తి దెబ్బతింది. పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో స్లాట్లు పెంచాలి. కోటా విధానంతో జిన్నింగ్ మిల్లులు పత్తిని ప్రాసెస్ చేయలేకపోతున్నాయని ఎంపీ తెలిపారు.

# అమెరికాలో జగన్‌రెడ్డి ఎన్ని కంపెనీలకు కలిశారు

- కలిసినట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధం
- లోకేష్ కలిసే కంపెనీల గేట్‌పాసులు సంపాదించలేరు
- ఈర్ష్యతోనే వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు
- చంద్రబాబు స్ఫూర్తితో లోకేష్ గూగుల్‌ను తెచ్చారు
- నాడు వైసీపీ ఎన్నిసార్లు సమీక్షలు జరిపిందో చెప్పాలి
- కొడాలి నాని ప్రజాతీర్పును గౌరవించలేదు
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధ్వజం



మంగళగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు 75ఏళ్ల వయసులో కూడా నిత్యం సమీక్షలతో క్వాంటం వ్యాలీ, అమరా వతి, విశాఖపట్నంలో పెట్టుబడులే లక్ష్యంగా కష్టపడుతుంటే.. వైసీపీ నాయకులు ఆయన కృషిని ప్రశం సించాల్సింది పోయి దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ గతంలాగే ఈసారి కూడా అమె రికా పర్యటనను పెట్టుబడుల ఆకర్షణకే లక్ష్యంగా పెట్టుకున్నారు. యువగళం పాదయాత్రలో చెప్పినట్లు 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. "మహేష్ సినిమాలో ఒక డైలాగ్ ఉంటుంది. 'నువ్వు మర్చిపో యినా, జనం మర్చిపోయినా, దేశం మర్చిపోయినా... గూగుల్ మర్చిపోదు కదా.. గూగుల్‌ను వైజాగ్ తీసుకువచ్చి రూ. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్‌ను వైజాగ్‌కు తీసుకొచ్చిన యువనాయకుడు లోకేష్ బాబును మనస్ఫూర్తిగా అభినందించాలి. మూడు రోజుల్లో అమెరి కాలో దాదాపు 18 ప్రపంచ దిగ్గజ కంపెనీల సీఈఓలు, ఎగ్జిక్యూ టివ్‌లతో సమావేశమయ్యారు. వీటిలో Google, Adobe, NVIDIA, Intel, AMD, OpenAI, Salesforce, Canva, Zscaler, Autodesk వంటి శక్తివంతమైన సంస్థలు ఉన్నాయి. ప్రస్తుతం ఇండియన్ ఎకానమీ జీడీపీ సుమా రు 4.19 ట్రిలియన్ డాలర్లు ఉంటే, కేవలం NVIDIA కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ మాత్రమే 4.6 ట్రిలియన్ డాలర్లు ఉంది. అలాంటి దిగ్గజ కంపెనీతో లోకేష్ సమావేశం కావడం, వాటి పెట్టుబడులను రాష్ట్రం వైపు మళ్లించడానికి కృషి చేయడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవాలి. ఆ కంపెనీల పేర్లు సరిగా పలకడా నికి కూడా కష్టపడే వైసీపీ నాయకులు..ఇంతటి గొప్ప కృషిని విమర్శిస్తారా? అభివృద్ధి పట్ల వారి చిత్తశుద్ధి ఏంటో అర్థం కావడం లేదు. తెలుగులో సరిగా మాట్లాడలేదని విమర్శించిన వైసీపీ నాయకులు, ఇప్పుడు లోకేష్‌తో అరగంట మాట్లాడగల నాయకులు మీ పార్టీలో ఎంతమంది ఉన్నారో ఆలోచించుకోవాలని హితవు పలికారు.

**బహిరంగ చర్చకు సవాల్**

ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌రెడ్డి అమెరికా వెళ్లి ఇలాంటి కంపెనీలను కలిసినట్లు నిరూపిస్తే తాను బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. చంద్రబాబు మైక్రోసాఫ్ట్‌ను హైదరా బాద్‌కు తీసుకురావడం వల్లే నేడు ఆ నగరం రూ.2.90 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు చేస్తోంది. అదే స్ఫూర్తితో లోకేష్ బాబు గూగుల్ వంటి కంపెనీలను వైజాగ్ తీసుకురావడం వల్ల ఆ నగరం దశ దిశ మారబోతుంది. వైజాగ్ పెట్టుబడులకు స్వర్గధా మం అవుతుంది. లోకేష్ వ్యక్తిగత పర్యటనలకు ప్రభుత్వ ధనాన్ని ఒక్క రూపాయి కూడా వాడటం లేదు.. నిరూపిస్తే తాను రాజీనా మా చేస్తానని సవాల్ చేశారు. గత ప్రభుత్వంలో మంత్రులు బూతులు తిట్టారు తప్ప.. ఎప్పుడైన రివ్యూ మీటింగ్ పెట్టారా అని ప్రశ్నించారు. గత పాలనలో ఒక్క ఐటీ కంపెనీ తెచ్చి పాపాన పోలేదు.

ఈరోజు ఇన్ని ఐటీ కంపనీలు తీసుకొచ్చిన లోకేష్‌కు అభినందనలు తెలుపుతున్నాను. ఐటీ కంపెనీలు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే మీరు జీర్ణించుకోలేక ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు బనాయించడం వల్లే పాస్‌పోర్ట్ ఎక్స్‌టెన్షన్ సమస్య వచ్చి లోకేష్‌తో పాటు అమెరికా పర్యటనకు వెళ్లలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. గుడివాడ ప్రజలు ఓడించారనే కక్షతో మాజీ మంత్రి కొడాలి నాని ఏడాది పాటు ఆ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదని, ప్రజా తీర్పును గౌరవించకుండా దాక్కున్నారని తీవ్రంగా విమర్శించారు. నేను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా పనిచేసినప్పుడు దానిని దేశంలో నెంబర్ వన్ స్థానంలో పెట్టాను, మరి మీరు చెప్పడానికి ఏముంది? అని ప్రశ్నించారు. దివ్యాంగుల క్రికెట్‌లో ఇండియన్ టీమ్ గెలిస్తే వ్యంగ్యంగా మాట్లాడటం దారుణం. సభ్య సమాజంలో బతికేటప్పుడు భాషపై నియంత్రణ ఉండాలి. 'అటు ఇటు కానోళ్లు' అనే వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇంగ్లీష్ రాదని మాట్లాడటం హాస్యాస్పదం. 1998 మార్చిలో బిల్ గేట్స్‌తో సమావేశమై మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తెచ్చింది ఆయన కాదా? ఆ రోజున మీరు ఏమైనా ట్రాన్స్‌లేటర్‌గా వెళ్లారా? వైసీపీ నాయకులు చేసే బూతుల ప్రెస్‌మీట్లు, తిట్లకు కాలం చెల్లింది. కనీసం రాష్ట్ర అభివృద్ధిలో కలిసి రాలేకపోయినా అసెంబ్లీకి రావా లని కోరుతున్నాం. కూటమిలోని ఏ ఎమ్మెల్యే కూడా అగౌరవమైన భాష మాట్లాడరు. ఈ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ప్రతి నాయ కుడు కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు.

# డ్రోన్, ఏరో స్పేస్ రంగంలో పెట్టుబడులు

**- మంత్రి జనార్దన్‌రెడ్డిని కలిసిన ప్రతినిధులు**
**- ప్రతిపాదనలు అందజేసిన మూడు సంస్థలు**



అమరావతి (చైతన్యరథం): సచివాలయంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో ప్రముఖ డ్రోన్, ఏరోస్పేస్ సంస్థల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు త్సల్లా ఏరో స్పేస్, వెక్రోస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్సో డ్రోన్ సిస్టమ్స్ సంస్థల ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డ్రోన్– ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులకు పెట్టేందుకు ప్రతిపాదనలు సమర్పిం చారు. బెంగళూరుకు చెందిన త్సల్లా ఏరోస్పేస్ అధునాతన మానవ రహిత వైమానిక వ్యవస్థల పరిశోధన, రూపకల్పన, అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన సంస్థ. రాష్ట్రంలో అడ్వాన్స్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ ప్రతినిధులు నారాయణ త్సల్లా, వినాయక్ త్సల్లా ఆసక్తి చూపారు. రాబోయే 5 ఏళ్లలో దాదాపు రూ.500 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపా రు. డ్రోన్ ఉత్పత్తి యూనిట్, బేస్ స్టేషన్స్ ఏర్పాటుకు బెంగళూ రుకు చెందిన వెక్రోస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ప్రేమ్ సాయి ఆసక్తి చూపారు. జీపీఎస్ లేదా మానవ రహిత పైలెట్లతో కఠిన వాతావరణ పరిస్థితులలో నావిగేట్ చేయడానికి ప్రత్యేకంగా డ్రోన్లు రూపొందించడంలో ఈ సంఒకు అనుభవం ఉంది. సర్వే, నిఘా, భద్రత, వ్యవసాయం కోసం డ్రోన్స్, యాంటీ డ్రోన్స్, యాక్ససరీస్, లాంగ్ రేంజ్ సిస్టమ్‌లో స్వదేశీ వ్యవస్థలపై దృష్టిసారిస్తోన్న సంస్థ ఎక్సో డ్రోన్స్ ట్రైనింగ్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి చూపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల రాకతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సుస్థిర నాయకత్వంతో రాష్ట్రంపై పెట్టుబడిదారుల్లో నమ్మకం, విశ్వాసం పెరిగింది. కూటమి ప్రభుత్వంలో గత ఏడాదిన్నర పాల నలో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయని తెలిపారు.

## తెలుగు ప్రాభవం చాటే వారధిగా

# అధికార భాషా సంఘం

**- చైర్మన్‌గా త్రివిక్రమరావు అభినందనీయం**
**- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**
**- ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరు**

అమరావతి (చైతన్యరథం): మండలి వెంకట కృష్ణారావు పేరుతో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయడం తెలుగు భాషపై ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్‌గా నియమితులైన త్రివిక్రమరావు గురువారం స్థాని క పున్నమి ఘాట్‌లోని హరిత బెర్మ్ పార్క్ సమావేశ మందిరంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు భాషాభివృద్ధికి రెండు ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. మొదటిది ప్రముఖ తెలుగు పండితుడు, ప్రపంచ తెలుగు మహాసభలను విజయవం తంగా నిర్వహించి తెలుగు భాషకు ప్రత్యేకమైన స్థానం తీసుకు వచ్చిన మండలి వెంకట కృష్ణారావు పేరుతో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయడం, రెండవది అధికార భాషా సంఘాన్ని ప్రజల మధ్యలోకి తీసుకువెళ్లి భాషా ఔన్నత్యాన్ని పెంపొందించే సుదీర్ఘ పాత్రికేయ సేవలు అందించిన తివిక్రమరావు (విక్రమ్ పూల)ను అధ్యక్షుడిగా నియమించడం. చంద్రబాబు దూరదృష్టికి ఈ నిర్ణయాలే నిదర్శనం. చంద్రబాబు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే "మహా స్వాప్నికుడు" గ్రంథం, "1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం–సజీవ చరిత్ర" వంటి రచనలు త్రివిక్రమరావు నిబద్ధత కు నిదర్శనమన్నారు. తెలుగు మాతృభాషాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న త్రిభాషా విధానం, ప్రాథమిక విద్యలో తెలుగుకు ప్రధాన స్థానం కల్పించడం వంటి చర్యలు కూడా విక్రమ్ నాయకత్వంలో అధికార భాషా సంఘం పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



### అందరి సలహాలు తీసుకుని ముందుకెళతా: త్రివిక్రమరావు

మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం నూతన చైర్మన్ పి.త్రివిక్రమరావు మాట్లాడుతూ ప్రపంచం నలుమూలలా తెలుగు భాష ఔన్నత్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేలా అధికార భాషా సంఘం సారథిగా, వారధిగా పనిచేస్తుందని తెలి పారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వచ్చిన పెద్దలు, మిత్రు లు, ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబా బు చైర్మన్‌గా తనను నియమించడం మర్చిపోలేనన్నారు. తెలుగు భాష ఉపయోగాన్ని పెంచే కార్యక్రమాలపై అందరి సలహాలు సూచనలు తీసుకుని ముందుకు వెళ్లతానన్నారు. తాను ఇటీవల మహా స్వాప్నికుడు చంద్రబాబు అనే పుస్తకం రాయడం జరిగిం దని, అది తన మనస్సు అంతరాల నుంచి వచ్చిందని ఆయనతో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షిబ్లీ, మాజీ శాసనమండలి సభ్యు లు టీడీ జనార్ధన్, సీనియర్ నాయకులు నన్నపనేని రాజకుమారి, వాసిరెడ్డి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

**ఇప్పటివరకు 20,64,673 మెట్రిక్ టన్నులు - రైతులకు రూ.4,609.89 కోట్ల చెల్లింపు**



అమరావతి(చైతన్యరథం): ఈ ఆర్థిక సంవత్సరం 2025–26 (11 డిసెంబర్ వరకు పురోగతి) రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగో ళ్లు వేగవంతం అయ్యాయి. ధాన్యం సేకరణలో పౌరసరఫరాల శాఖ రికార్డులు సృష్టిస్తోంది. డిసెంబర్ 10న ఒక్కరోజునే 1,46,607 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. మొత్తం కొనుగోలు వివరాలు పరిశీలిస్తే ఇప్పటి వరకు 3,24,296 మంది రైతుల నుంచి 20,64,673 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. వారికి ఇప్పటివరకు రూ. 4,609.89 కోట్లు చెల్లించారు. ఎఫ్‌సీఐ(సీఎంఆర్)కు 1,71,651 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపారు. ధాన్యం కొనుగోలు ప్రారం భమైన 15 రోజుల్లోనే రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగాయి. రవాణా కోసం 32,000 లారీలు, ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, ప్రత్యేక రైళ్లు వినియోగించారు. సజావుగా కొనుగోలు, రవాణా ప్రక్రియ జరిగింది. కృష్ణా–గుంటూరు–బాపట్ల జిల్లాల్లో వర్షాలు, దిత్వా తుఫాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని అత్యవసర చర్య లు తీసుకున్నారు. కృష్ణా జిల్లాలోని 106 రైస్ మిల్లులకు ఇంట ర్–డిస్ట్రిక్ట్ మూమెంట్ అనుమతులు ఇచ్చారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పారదర్శక కొనుగోళ్లకు చర్యలు తీసుకుం టూ సమయానికి చెల్లింపులు చేయడం వల్లే ఇది సాధ్యమవు తోంది. అదేవిధంగా మిల్లర్లపై కఠిన నిఘా ఉంచి రోజువారీ సమీక్షలు నిర్వహిస్తూ పర్యవేక్షించడంతో అధికారులు కూడా శ్రద్ధగా పనిచేస్తున్నారు.

# నేరస్థులను అండగా ఎందుకు ప్రోత్సహిస్తున్నారు

**- బోరుగడ్డను ఎందుకు బయటకు తెచ్చారు**
**- జగన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ మాఫియా డాన్**
**- గూండాగాళ్లని రాష్ట్రం మీదికి వదులుతున్నారు**
**- వైసీపీ నేతల డ్రామాలను ప్రజలు నమ్మరు**
**- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్**



మంగళగిరి (చైతన్యరథం): జగన్ ఆంధ్రా గూండారాజ్ మాత్రమే కాదు..మాఫియా డాన్ కూడా అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ విమర్శించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోరుగడ్డ అనిల్‌ను జగన్ జైలు నుంచి బయటికి తెచ్చి ఘనకార్యం చేశారు. బోరుగడ్డ అనిల్, ఇంటలిజెన్స్ మాజీ చీఫ్ సీతారామాంజనేయులును బెయిల్ ఇచ్చి బయటికి తెచ్చారు. జగన్ కోసం పనిచేసే లీగల్ టీం తన కోసం పనిచేసిం దని బోరుగడ్డ అనిల్ గొప్పగా చెప్పుకున్నాడు. బోరుగడ్డ అనిల్ రాష్ట్రం కోసమో, దేశం కోసమో పోరాడిన వ్యక్తి కాదు. ప్రజల కోసం మాట్లాడిన ప్రజా ఉద్యమకారుడు కూడా కాదు. ఆయనపై ఇన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమేమిటి? అని ప్రశ్నించా రు. బోరుగడ్డ చేసే పనులన్నీ పనికిరాని పనులే. బోరుగడ్డ అనిల్ మాట్లాడే మాటలు జగన్ తన కుటుంబసభ్యులకు వినిపించే ధైర్యం ఉందా? రాష్ట్రానికి ఏం మేలు చేశాడని ఇలాంటి క్రిమినల్, రౌడీని బయటికి తెచ్చి కాపాడారు? నేరస్థులను బయటికి తెచ్చి జనజీవన స్రవంతిలో కలపడమే జగన్ పనిగా పెట్టుకున్నారు. జగన్ నేరస్థు లను ప్రోత్సహిస్తున్నారని ఈ సంఘటనతో రుజువైంది. ఇంకా నలుగురు జైలు నుంచి బయటపడి మేము వైసీపీ నాయకుల మంటున్నారు. జగన్ ఏమో వారికి వైసీపీతో సంబంధం లేదంటు న్నారు. ఓ నేరస్థుడు.. కొడాలి నానితో అంత క్లోజ్‌గా మాట్లాడు తుంటే అతను వైసీపీ వ్యక్తి కాదంటే ఎలా? ఇలాంటి విషయాలు ప్రజలు నమ్మరు. రౌడీలకు, గూండాలకు డబ్బులిచ్చి నేరాలకు పాల్పడేలా ప్రోత్సహిస్తున్నారు. ఇతర పార్టీకి చెందిన మహిళలను తిట్టించడానికి ప్యాకేజీగాళ్లను ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల కు బెయిల్ ఇచ్చి బయటికి తెచ్చిందేగాక వీరికి వైసీపీతో సం బంధం లేదని డ్రామాలాడుతున్నారు. పేర్ని నానితో క్లోజ్‌గా మాట్లా డుతున్నట్లు ఫొటోలో స్పష్టంగా కనిపిస్తున్నా సంబంధం లేదనడం అబద్ధం కాదా? వెధవ పనులు చేసి మేం చేయలేదని చెబుతారు. వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు, మంత్రులే సజ్జల వద్దకు వెళ్లలేక పోయారు. అలాంటిది బూతు రాయుడు ఎలా కలవగలిగాడు. పెయిడ్ బ్యాచ్, గూండాగాళ్లను గూండారాజ్ అనకుండా ఏమం టారు? పోలీసులను కూడా రౌడీలుగా వాడుకుంటారనడానికి పోలీసు అధికారి సీతారామాంజనేయులుకు కూడా బెయిల్ ఇచ్చి బయటికి తెచ్చారనడానికి నిదర్శనం. గూండాలకు అధికారమిస్తే ఇలాంటి గూండాలనే తయారు చేస్తారు. 2019 నుంచి 2024 వరకు గూండాలు, పోలీసులు ఏకమై జగన్ కోసం పనిచేశామని నేరస్థులు క్లియర్‌గా ప్రజల ముందు చెబుతున్నారు. ప్రజలు వైసీపీ నాయకుల డ్రామాలు నమ్మరని హితవుపలికారు.

### శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పనిలో జగన్

లోకేష్ దేశ విదేశాలకు వెళ్లి పట్టుబడులు తెస్తున్నారు. రాష్ట్రం లోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించి వారి తల్లిదండ్రు లను ఆదుకోవాలని నిద్రాహారాలు మాని శ్రమిస్తున్నారు. చంద్రబా బు అన్ని రంగాలతో నిరంతరం సమీక్షలు జరుపుతున్నారు. రాజధాని అమరావతిని ఎలా తీర్చిదిద్దాలి, పోలవరం ఎలా పూర్తి చేయాలి? అని ఆలోచిస్తుంటే జగనేమో ఈ గూండాగాళ్లని రాష్ట్రం మీదికి వదులుతున్నాడు. నేరస్థులు ఎప్పుడూ జైల్లో ఉండాలి అలాంటి వారిని ఎందుకు రిలీజ్ చేయించారు? ఎవరిని చంపిం చాలని బోరుగడ్డను బయటికి తెచ్చారు. ఏ నేరం చేయించబోతు న్నారో తెలియాలి. చంద్రబాబు, లోకేష్‌ల పనితీరు బాగుంది. దాదాపు 20 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చారు. అమెరికాలో లోకేష్ ప్రతిరోజు దిగ్గజ పారిశ్రామి కవేత్తలతో భేటీ అవుతున్నారు. నేరస్థులను పెంచి పోషించే జగన్ లాంటి గూండా రాజ్, మాఫియా డాన్‌లు కావాలా? రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబు, లోకేష్ లాంటివారు కావాలో ప్రజలే నిర్ణయించు కోవాలి. వైసీపీలో ఒక్క నిజాయితీపరుడు కూడా లేడు. అవినాష్ రెడ్డి, కొడాలి నాని, పేర్ని నాని, అనంతబాబు, బోరుగడ్డ అనిల్, గోరంట్ల మాధవ్ లాంటి వారంతా అవినీతిపరులే. దేశంలో మొట్టమొదట ఖాళీ అయ్యేది వైసీపీనే. ఆ పార్టీని ప్రజలే అం తమొందిస్తారు. వైసీపీ హయాంలో ఆర్గనైజింగ్ క్రైమ్, మాఫియా ఏకతాటిపైకి వచ్చింది. ఇప్పుడిప్పుడే రాష్ట్రం గాడిలో పడుతోంది. బోరుగడ్డ అనిల్ లాంటివారిని బయటికి తెచ్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేసే ఆలోచనలో జగన్ ఉన్నట్లు అనుమానం కలుగుతోందని తెలిపారు.

## మహిళా సాధికారతపై చర్చ - పాల్గొన్న ఏలూరు ఎంపీ



ఏలూరు /ఢిల్లీ (చైతన్యరథం): ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం సాయంత్రం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, మరికొందరు ఎన్డిఏ ఎంపీలతో కలిసి కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవితో ఆమె నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మహిళా సాధికారత, మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, అమలు అవుతున్న తీరు, ఇతర అంశాలపై చర్చ జరిగినట్లు ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించకండి

**●పోలీస్ అధికారులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలు**



దెందులూరు (చైతన్యరథం): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యం వివాదాలు, అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు, అమాయకులపై తప్పుడు కేసులు, దాడులతో దెందులూరు నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, గ్రామాలన్నీ ఎంతో ప్రశాంతంగా ఐకమత్యంగా ఉంటున్నాయని, అటువంటి వాటిని తిరిగి మరోసారి అలజడులు సృష్టించి, గ్రామాల్లో ప్రశాంతత దెబ్బతీయాలని ఎవరు ప్రయత్నించినా, అసాంఘిక కార్యక్రమాలు అక్రమాలకు ఎవరూ పాల్పడినా వారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పోలీస్ అధికారులకు సూచించారు. ఇటీవల పెదవేగి పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మదాల హరి గోపాల్ దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ ఇన్స్పెక్టర్‌కి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రంపై పంజా విసురుతున్న చలి...

### వణికిపోతున్న ఏజెన్సీ ప్రాంతాలు



మన్యం (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాలపై చలి పంజా విసురుతోంది. సింగిల్ డిజిట్‌కు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాధారణం కంటే 7 డిగ్రీలు ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జనం చలితో వణికిపోతున్నారు. హైవేపై వెళ్తున్న వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక నెమ్మదిగా వెళు తున్నారు. ఏపీలోని అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. మినుములూరు 4, అరకు 4.6, పాడేరు 6, చింతపల్లి 6.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతుండడంతో ఏజెన్సీ వాసులు గజగజలాడుతున్నారు. దట్టంగా పొగ మంచు కమ్ముకుంది. ఉదయం 10 గంటలైనా మంచు తెరలు వీడలేదు. అటు పాడేరు ఏజెన్సీ పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి పెరిగింది. పాడేరు ఏజెన్సీలో రెండ్రోజులుగా సింగిల్ డిజిట్స్‌కు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.. పాడేరు మండలం సంగోడి పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో మంచు గాజు ముక్కలుగా మారిపోయింది. ఇటు తెలంగాణలో గురువారం నుంచి చలి తీవ్రత మరింత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరో 5 రోజులు తీవ్రమైన చలిగాలులు వీస్తాయని వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తగ్గుతాయని తెలిపింది. హైదరాబాద్ సహా మధ్య తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశమున్నదని వెల్లడించింది. పొడిగాలి, బలమైన ఈశాన్య గాలులు రాత్రిపూట చల్లదనాన్ని పెంచడమే ఉష్ణోగ్రతల తగ్గుదలకు కారణమని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రత సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 5.6 డిగ్రీలుగా నమోదైంది.

## పశు వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం (చైతన్యరథం): రూ.38.52 లక్షల నిధులతో నిర్మించిన పశు వైద్యశాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సీఎస్ఆర్ ద్వారా సమకూర్చిన దివీస్ ల్యాబ్స్ యాజమాన్యాన్ని గంటా అభినందించారు. ఆసుపత్రిలోని సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఆవులు, గేదెల పెంపకం ద్వారా వచ్చే ఆదాయ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పశువులను కూడా కుటుంబంలో ఒక భాగంగా చూస్తారన్నారు. నగరానికి వెళ్లి నేరుగా పాలు అందిస్తే ఎక్కువ నగదు వస్తుందని తెలిపారు.



## కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు

కొవ్వూరు (చైతన్యరథం): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో రోడ్లను అభివృద్ధి నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పంచాయతి రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ జీవో విడుదల చేశారని, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గ్రామీణ ప్రాంత రోడ్లను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహించి SASCI - Special Assistance to the States for Capital Investment (మూలధన పెట్టుబడుల కోసం రస్తాలకు ప్రత్యేక సహాయం) నిధులు మంజూరు చేయడం గొప్ప విషయమని నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదని, అందువల్లనే సదరు రోడ్లు పూర్తిగా దెబ్బతిని పాడయి పోయాయని, పంచాయతీరాజ్ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అభివృద్ధికి బాటలు వేసారని, అలాగే పంచాయతి రాజ్ శాఖలో ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించారని కొనియాడారు. కొవ్వూరు నియోజకవర్గంలో 1.తాళ్ళపూడి మండలం అన్నదేవరపేట టు సూరయ్యపేట రూ.1.38 లక్షలు, 2.కొవ్వూరు మండలం మద్దూరు-చంద్రవరం రోడ్డు టు వాడపల్లి కాలనీ రూ.1.75 లక్షలు, 3.కొవ్వూరు మండలం మద్దూరు విలేజ్ రోడ్డు రూ.1.35 లక్షలు, 4. కొవ్వూరు మండలం దేచర్ల అప్రోచ్ రోడ్డు రూ.85 లక్షలు, 5.చాగల్లు మండలం మార్కొండపాడు టు ముప్పవరం రూ.2.65 లక్షలు, 6. చాగల్లు మండలం రోడ్డు టు చాగల్లు రైల్వే ఫీడర్ రోడ్డు రూ.1.59 లక్షలు మొత్తం:9 కోట్ల 60 లక్షలు మంజూరు అయ్యాయని, విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో సర్వ శిక్ష అభియాన్ ద్వారా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. చాగల్లు హై స్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌కు రూ.1.44 లక్షలు, 2. చాగల్లు MEO కార్యాలయం రిపేర్ రూ.5 లక్షలు, 3. తాళ్ళపూడి MEO కార్యాలయం రిపేర్‌కు రూ.5 లక్షలు, 4.కొవ్వూరు MEO కార్యాలయం రిపేర్‌కు రూ.5 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు.



## ప్రణాళిక ప్రకారం పారిశుద్ధ్య నిర్వహణ ఉండాలి

**●ఆరోగ్య విభాగం అధికారులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఒక ప్రణాళిక ప్రకారం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సూచించారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులు, సిబ్బందితో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. నగరంలో డ్రైనేజీలు, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దృష్టికి తీసుకువచ్చారు. 31.792 కిలో మీటర్ల డ్రైనేజీల్లో మాన్యువల్‌గా, 47.662 కిలో మీటర్ల బుల్ పద్ధతిలో, 11.877 కిలో మీటర్లు జేసీబీల ద్వారా, 10.766 కిలో మీటర్లు టెండర్లు పిలిచి డ్రైనేజీలను డీ సిల్టేషన్ చేయడం జరుగుతోందని ఆరోగ్య విభాగం అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మనమంతా ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆ దిశగానే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నగరంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చూడాలని సూచించారు. అలాగే డ్రైనేజీల వ్యవహారం వచ్చే సరికి ఒక టైమ్ టేబుల్ వేసుకుని ఒక తేదీన ఒక చోట మొదలు పెట్టి సదరు డివిజన్‌లో మొత్తం పూర్తి మళ్లీ మొదలు పెట్టిన తేదీకే అదే ప్రాంతం నుంచి డ్రైనేజీని డీ సిల్టేషన్ చేస్తే మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుందని సూచించారు. ఆ మేరకు సిబ్బందిని సిద్ధం చేయాలని సూచించారు. నగరం ఎప్పుడూ క్లీన్‌గా పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు.

**సారా విక్రయించే వారికి కౌన్సిలింగ్**

స్థానిక పాత సోమాలమ్మ అమ్మవారి ఆలయం పక్క స్థలంలో సారా విక్రయాలు జరుగుతున్నాయంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదుపై రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించారు. వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి సదరు ప్రాంతానికి పంపించారు. ఆ ప్రాంతానికి ఎక్సైజ్ సీఐ తన సిబ్బందితో గురువారం తెల్లవారుజామున దాడి చేయగా సారా విక్రయించే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారిని రిమాండ్‌కు పంపించారు.

## సింహాచలానికి ప్రారంభమైన డబుల్ డక్కర్ బస్ సర్వీస్

సింహాచలం (చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలానికి డబుల్ డెక్కర్ సర్వీసు ప్రారంభమైంది. విశాఖపట్నంలో పర్యాటక ఆకర్షణగా ప్రవేశపెట్టిన ఈ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను సింహాచలం వరకు పొడిగించారు. గురువారం నుంచి వీటిని ప్రారంభించినట్లు పర్యాటక శాఖ సిబ్బంది తెలిపారు. నగర పర్యాటకులతో పాటు సింహాచలం అప్పన్నస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.



# పారిశుద్ధ్యానికి మరింత ప్రాధాన్యత : ఎమ్మెల్యే తంగిరాల

నందిగామ (చైతన్యరథం): పారిశుద్ధ్యానికి ప్రజలంతా మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా పట్టణ పరిశుభ్రత కోసం కార్మికులు కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వ్యాఖ్యానించారు. గురువారం నందిగామ పట్టణంలో ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త బుట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ మరియు కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. పట్టణ ప్రజల స్థాయిలో చెత్త వేరు వేరు చేయించే అలవాటును పెంపొందించేందుకు, అలాగే పారిశుద్ధ్య కార్మికుల పనిభారం తగ్గించేందుకు ఈ కొత్త డస్ట్‌బిన్లు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, శుభ్రమైన నందిగామ నిర్మాణానికి పురపాలక సంఘం, సిబ్బంది, ప్రజలు కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణ శుభ్రత కోసం వారు చేస్తున్న కృషిని మెచ్చుకుంటూ, ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలు, రక్షణ సామగ్రి అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు సైతం చిత్తశుద్ధితో పనిచేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆపరేషన్ గ్రీన్స్ పథకంలో దేశవ్యాప్తంగా పురోగతి

**◆ఏపీకి రూ.203.66 కోట్ల గ్రాంటు ఆమోదం, రూ.85.37 కోట్లు విడుదల**

**◆కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ వెల్లడి**

**◆ఆపరేషన్ గ్రీన్స్ పథకంపై ప్రశ్నించిన ఎంపీలు కేశినేని శివనాథ్, బస్తిపాటి నాగరాజు**

విజయవాడ / ఢిల్లీ (చైతన్యరథం): "ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజనలో భాగంగా అమలు అవుతున్న ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద గత మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.573.62 కోట్లు కేటాయించగా, రూ.365.78 కోట్లు విడుదల చేసి వినియోగించారు. ఈ కాలంలోనే దేశవ్యాప్తంగా 35 ప్రాజెక్టులు, ఆంధ్రప్రదేశ్‌లో 14 ప్రాజెక్టులు ఆమోదించినట్లు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ వెల్లడించారు. లోక్‌సభలో గురువారం ఎంపీలు కేశినేని శివనాథ్, బస్తిపాటి నాగరాజు కలిసి ఆపరేషన్ గ్రీన్స్ పథకంపై ఆమోదించిన ప్రాజెక్టు వివరాలు గురించి కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖను ప్రశ్నించగా, ఆ శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. దేశవ్యాప్తంగా 35 ప్రాజెక్టులకు రూ.1595.79 కోట్లు వ్యయం కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 14 ప్రాజెక్టులకు రూ.810.43 కోట్లు వ్యయం అయినట్లు వివరాలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లో టమోటా, మామిడి, ష్రింప్ ప్రాసెసింగ్ రంగాల్లో చిత్తూరు, గుంటూరు, కృష్ణా, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి విశాఖపట్నం జిల్లాలో ఈ ప్రాజెక్టులు అమల్లో వున్నాయన్నారు. గత మూడు సంవత్సరాల్లో దేశంలోని వ్యవసాయ ప్రాసెసింగ్ రంగంలో గణనీయమైన అభివృద్ధి నమోదైందని తెలిపారు. ఆపరేషన్ గ్రీన్స్ పథకం ప్రస్తుతం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కవర్ చేస్తోందని పేర్కొన్నారు.. పథకం కింద 10 ఫల పంటలు, 11 కూరగాయల పంటలు మరియు ష్రింప్ ఉత్పత్తి క్లస్టర్లను గుర్తించి మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు..

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఈ ప్రాజెక్టులకు రూ.203.66 కోట్ల గ్రాంటు ఆమోదించబడగా, ఇప్పటి వరకు 85.37 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 3,40,751 మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్, ప్రిజర్వేషన్ సామర్థ్యం ఏర్పడిందన్నారు. ఈ పథకం అమలు ఫలితంగా రాష్ట్రంలోని 77,040 మంది రైతులు లబ్ధి పొందగా, మొత్తం 24,929 ఉద్యోగాలు సృష్టించబడ్డాయన్నారు.. ష్రింప్ ప్రాసెసింగ్ యూనిట్ల విస్తరణ, మామిడి మరియు టమోటా ప్రాసెసింగ్ సెంటర్ల అభివృద్ధి వల్ల రైతులకు మార్కెట్ భద్రత పెరిగి, ఆదాయం మెరుగుపడిందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, సరఫరా గొలుసు బలోపేతం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం పథక ప్రధాన లక్ష్యం అని మంత్రి తెలిపారు. ఆపరేషన్ గ్రీన్స్ పథకంతో భవిష్యత్‌లో వ్యవసాయ-ఆధారిత పరిశ్రమలు మరింతగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



# మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు (చైతన్యరథం): నగరంలోని 39వ డివిజన్ గుజ్జనగుండ్ల వాటర్ ట్యాంక్ సమీపంలోని రామిశెట్టి రామారావు నగరపాలక ఉన్నత పాఠశాలలో పీ-4 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర 2047 దిశగా హెల్తీ, హ్యాపీ, వెల్తీ ఫ్యామిలీ లను సృష్టించాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న 10 సూత్రాలలో అత్యంత కీలకమైన పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమం గుంటూరు పశ్చిమలో అత్యంత విజయవంతంగా అమలవుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అవసరార్థులైన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా, వారికి చేయూతనందించే వారిని మార్గదర్శులుగా గుర్తించి, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అద్భుతంగా రూపొందించిందన్నారు. ఈరోజు 106 సచివాలయం ద్వారా 1900 బంగారు కుటుంబాలకు వికాస్ హాస్పిటల్స్ మార్గదర్శులుగా ముందుకు వచ్చి, పరీక్షలు, మందులు, అవసరమైతే శస్త్రచికిత్సల వరకు పూర్తి ఆరోగ్య సాయం అందించేందుకు బాధ్యత తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇప్పటికే చార్టెడ్ అకౌంటెంట్లు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు, టీచర్లు, విద్యాసంస్థల మేనేజ్మెంట్లు వంటి అనేక విభాగాల వారు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్య, ఉపాధి, మౌలిక వసతులు, మౌలిక వసతులు వంటి ప్రతి రంగంలో మరిన్ని మార్గదర్శులు సమర్థంగా భాగస్వామ్యం కావడంతో పీ-4 కార్యక్రమం గుంటూరు పశ్చిమలో మరింత బలపడుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సమన్వయం చేసిన నోడల్ ఆఫీసర్‌కి, నాయకులకు, కార్పొరేటర్లకు, అలాగే మెడికల్ క్యాంప్‌లో చురుకుగా పాల్గొన్న వికాస్ హాస్పిటల్ సీఈఓ, డాక్టర్లు, నర్సులు, సిబ్బందికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

**◆ ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు 43వ డివిజన్‌లో ప్రజాదర్బార్... అర్జీలు స్వీకరించిన దూండి రాకేష్**



విజయవాడ (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకూడదనే ఉద్దేశ్యంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూండిరాకేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్‌లో ఊర్మిళ నగర్ వీఎంపీ పార్క్ రోడ్‌లో గల 43వ డివిజన్ తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి పశ్చిమ నియోజకవర్గ టిడిపి నాయకులు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్‌కి అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు తరలిరావటం జరిగింది. టీడీపీ నాయకులు ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ ప్రజాదర్బార్‌లో రేషన్ కార్డ్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డ్, టిడ్కో ఇళ్లు, ఇంటి స్థలాలు, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్లు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలు, సీనియర్ సిటిజన్ సమస్యలపై ప్రజలు ఎక్కువగా అర్జీలు పెట్టుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు ప్రతివారం పశ్చిమ నియోజకవర్గంలో ప్రజాదర్బార్ నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలకు వారం, పదిహేను రోజులలోపు పరిష్కారం చూపించే దిశగా ఎంపీ కేశినేని శివనాథ్ ప్రభుత్వాధికారులతో కలిసి చర్యలు తీసుకుంటారని తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చిన అర్జీలను పి.జి.ఆర్.ఎస్ ఆన్‌లైన్ ద్వారా వివిధ శాఖలకు పంపించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ ప్రెసిడెంట్ మొరబోయిన రాంబాబు, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్ సాయి యాదవ్, పశ్చిమ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు ఆర్.మాధవ, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మి భాను ప్రకాష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై భవానీల దీక్ష విరమణ ప్రారంభం

**◆ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు, సిబ్బంది**



విజయవాడ (చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో భవానీల దీక్ష విరమణ ప్రారంభమైంది. ఉదయం 6.30 గంటలకు శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వైదిక పండితులు రెండు హోమగుండాలను సూర్యోదయం తర్వాత అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. ఈ వైదిక క్రతువులో ఆలయ పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, స్థానాచార్యులు శివ ప్రసాదశర్మ, ఇతర పాలకమండలి సభ్యులు, పండితులు పాల్గొన్నారు. గురువారం నుంచి ఈనెల 15 వరకు భవానీ దీక్షల విరమణ కొనసాగనుంది. ప్రతీ ఏటా భవానీల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఈ భవానీ దీక్షలకు దాదాపు ఆరున్నర లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేశారు. ఇక ఇరుముడి సమర్పించేందుకు మూడు హోమ గుండాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక క్యూ లైన్లు, వెయిటింగ్ హాల్స్, అదనపు పార్కింగ్‌తోపాటు 19 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలి వచ్చే భవానీలకు మంచి నీరు అందజేస్తున్నారు. అలాగే భవానీ భక్తులకు ప్రసాదం కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. తాత్కాలిక కేశఖండనశాల, ఘాట్ల వద్ద తలనీలాల సమర్పణకు 950 మంది క్షురకులను నియమించారు.

4 వేల మంది పోలీసు సిబ్బందితోపాటు 370 సీసీ టీవీ కెమెరాలతో ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక దేవస్థానంలో అన్ని ఆర్జిత సేవలు డిసెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు నిలిపి వేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. గిరి ప్రదక్షిణ మార్గం వివరాలను అందించేందుకు మొబైల్ యాప్‌ను రూపొందించి భవానీలకు అందుబాటులోకి తెచ్చారు. 9 కిలోమీటర్ల మేర సాగనున్న గిరి ప్రదక్షిణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం

## పలు చోట్ల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు, (చైతన్యరథం): నగరంలో పర్యటించి 5 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ రావు శంకుస్థాపనలు చేపట్టారు. ముందుగా ఒంగోలు నగరంలోని 19వ డివిజన్ భాగ్యనగర్ 4వ లైన్ వద్ద నుండి తుబాకో కార్యాలయం వరకు 1.50 కోట్లతో నూతంగా నిర్మించునున్న సీసీ డ్రైనేజీ కాలువకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. 32వ డివిజన్ లోని రాజీవ్ నగర్ తేజస్విని అపార్ట్మెంట్ వద్ద 1.15 కోట్లతో నిర్మించునున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైనేజ్ కాలువకు శంకుస్థాపన చేశారు. 9వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ లలోని అడ్డరోడ్డులో 2.35 కోట్లతో నిర్మించునున్న సీసీ రోడ్డు సీసీ డ్రైనేజ్ కాలువకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారుగా 120 కోట్ల పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగినది అన్ని తెలిపారు. 700 కోట్ల రూపాయలు పైగా రోడ్ల విస్తరణకు ప్రతిపాధనలు సిద్ధం చేయడం జరిగినది త్వరలో ప్రతి రోడ్డు కూడా నిర్మించి సుందరికరణ చేపట్టడం జరుగుతున్నది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పాల్గొన్న అధికారులు, నాయకులు

# భక్తుల సౌకర్యం కోసం రీక్లెయిమ్ మిషన్ ఏర్పాటు

## తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి వెల్లడి



తిరుమల, (చైతన్యరథం): భక్తుల కోసం మరిన్ని డిపాజిట్ రీఫండ్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు తితిదే అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రీసైకిల్ మిషన్ల ఏర్పాటుపై గురువారం పద్మావతి అతిథి గృహంలో ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో ప్రయోగాత్మకంగా తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-5లో ఏర్పాటు చేసిన రెక్లెయిమ్ డిపాజిట్ రీఫండ్ మిషన్లకు విశేష స్పందన వచ్చిందని తెలిపారు. దీంతో మరిన్ని మిషన్లను పరిశీలనాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టెట్రాప్యాక్ లో పానీయాలను తీసుకున్న తర్వాత భక్తులు వాటిని అక్కడే పడేయకుండా ఈ డిపాజిట్ రీఫండ్ మిషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పరిశుభ్రత మెరుగుపడేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై తిరుమలలోని వ్యాపారులు, టెట్రా ప్యాక్ డీలర్లు కూడా స్థానికులకు అవగాహన కల్పించాలని ఈవో కోరారు.

ఈ సమావేశంలో డీఎఫ్వో ఫణి కుమార్ నాయుడు, డిప్యూటీ ఈవోలు సోమన్నారాయణ, మేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కలివి కోడి... కనపడితే చెప్పండి!

## అరుదైన కోడి కోసం కోట్లు వెచ్చించి వెతుకుతున్న అధికారులు

సిద్ధవటం, (చైతన్యరథం): అరుదైన పక్షిగా కలివికోడి గుర్తింపు పొందింది. శతాబ్దాల కిందట అంతరించిపోయిందని అంతర్జాతీయ పరిశోధక సంస్థ భావించిన నేపథ్యంలో సిద్దవటం అటవీ రేంజ్లో అనూహ్యంగా కనిపించింది. పక్షి శాస్త్రవేత్తలు, అటవీ అధికారులను ఊరించి కొన్ని రోజులకే చనిపోయింది. ఆ తర్వాత నుంచి కలివికోడి ఆచూకీ గుర్తించేందుకు సుమారు 39 ఏళ్లుగా అన్వేషణ సాగుతూనే ఉంది. ఇప్పటి వరకు సుమారు రూ.50 కోట్ల వరకు ఖర్చు అయింది. అయినా ఇంకా ప్రత్యక్షంగా కనిపించలేదు. ఇటీవల ఇతర రాష్ట్రాలకు చెందిన పక్షి ప్రేమికులు కూతను రికార్డు చేశామంటూ అంతర్జాలంలో పోస్టు చేయడం... అది కాస్తా సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారడం చర్చనీయాంశంగా మారింది. సిద్దవటం రేంజ్ పరిధి అట్లూరు మండలంలోని కొండూరు బీట్ అటవీ ప్రాంతంలో 1980 జనవరి 26న అరుదైన కలివికోడి కనిపించింది. కొన్ని రోజులకే మృతిచెందింది. ఆ జాతి పక్షులను తిరిగి కనిపెట్టి సంతతిని పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ, రాయల్, లండన్ సొసైటీలు నడుం బిగించాయి. పాద ముద్రల సేకరణ, కెమెరాలతో ఫొటోల చిత్రీకరణ, కూత రికార్డు, మరికొన్ని రకాలుగా అన్వేషణ పనులు సాగిస్తున్నారు. 2002లో సీనియర్ పక్షి శాస్త్రవేత్త జగన్నాథం సిద్దవటం రేంజ్లో కలివికోడి కూతను రికార్డు చేశారు. తర్వాత నుంచి ఎలాంటి ఆనవాళ్లు కన్పించలేదు. ఇటీవల అటవీ శాఖ ఉన్నతాధికారులు కొత్తగా అడ్వాన్స్ ఆడియో మాత్ అనే అధునాతన పరికరాలతో ప్రయోగాత్మకంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిక్షిప్తమైన డేటాను పదిహేను రోజులకొకసారి పరిశీలిస్తున్నారు. ఫ్లాష్ రాకుండా చిత్రాలు తీసే 20 అధునాతన కెమెరాలను అడవిలో అమర్చారు.



# వేదాయపాళెంలో రెండు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయాలి

## హెూంమంత్రి అనితను కోరిన టీడీపీ నేత కోటంరెడ్డి



నెల్లూరు, (చైతన్యరథం): వేదాయపాలెంలో రెండు పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర హెూంశాఖ మంత్రి అనితను తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్రెడ్డి కోరారు. గువారం ఆయన అమరావతిలో హెూంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిధర్రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఐదో పట్టణం (వేదయపాలెం) శివారు ప్రాంతాలను సమర్ధంగా పర్యవేక్షించడం పోలీసులకు కష్టతరమవుతోందని తెలిపారు. గంజాయి సంబంధిత కార్యకలాపాలను అరికట్టడం. శాంతి భద్రతలను కాపాడటం పోలీసులకు కష్టంగా మారిందని అన్నారు. ఈ నేపథ్యంలో వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిని రెండు పోలీస్ స్టేషన్లుగా ఏర్పాటు చేయాలని హెూంమంత్రిని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. మంత్రి అనిత సానుకూలంగా స్పందించినట్లు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వెల్లడించారు.

# ఔటర్ రింగ్ రోడ్డు భూములు పరిశీలన

## కార్యక్రమంలో పాల్గొన్న తుడా చైర్మన్ సి దివాకర్ రెడ్డి, అధికారులు



తిరుపతి(చైతన్యరథం): ఆధ్యాత్మిక నగరం తిరుపతి భవిష్యత్తు అవసరాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఔటర్రింగ్ రోడ్డు ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. తుడా చైర్మన్ సి.దివాకర్రెడ్డి అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రామచంద్రాపురం, రేణిగుంట, వడమాలపేట మండలాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో (కొత్త మాస్టర్ ప్లాన్ రోడ్డు) నిర్మాణానికి సర్వే ప్రారంభించారు. గతంలో సీఎం చంద్రబాబు వైకుంఠమాల పేరుతో చేపట్టదలచిన ఔటర్ రింగ్ రోడ్ ప్రతిపాదనలకు తిరిగి కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కువగా వినియోగిస్తూ ఔటర్రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై దృష్టిసారించారు. వడమాలపేట సమీపం నుంచి అప్పలాయగుంట, అనుపల్లి, రామచంద్రాపురం, పనపాకం, ఐతేపల్లి. నారావారిపల్లి, కల్యాణి డ్యామ్, జూపార్క్, అలిపిరి, కరకంబాడి రోడ్డు మీదుగా మల్లవరం, పాదిరేడు ప్రాంతాలున్నాయి.

# రహదారి అభివృద్ధికి రూ.107.94 కోట్లు

## మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మంత్రి సవిత కృతజ్ఞతలు



పెనుకొండ, (చైతన్యరథం): సత్యసాయి జిల్లాలో రహదారుల మరమ్మతులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. జిల్లాలోని, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మరమ్మతులు, విస్తరణ పనులకు మొత్తం జిల్లాకు రూ.107.94 కోట్లు మంజూరు చేయడం రాష్ట్ర అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వంకు ఉన్న దృఢ సంకల్పం అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన రోడ్లను, రవాణా సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిధులతో గ్రామీణ రహదారుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పునర్నిర్మాణం, గ్రామీణ లింక్ రోడ్ల మెరుగుదలకు సంబంధించిన పనులు త్వరితగతిన ప్రారంభమవుతాయి" అని తెలిపారు. ఈ నిధుల కేటాయింపుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రులు పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సవితమ్మ .అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పారదర్శకతతో చేపడతామని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం అభివృద్ధి చెందే వరకు కృషి చేస్తామని రహదారి సదుపాయాల మెరుగుదల ద్వారా జిల్లా నియోజకవర్గ ఆర్థిక, సామాజిక పురోగతికి మరింత ఊతం లభిస్తుంది" అని మంత్రి సవిత తెలిపారు.



## మున్సిపల్ చైర్మన్‌గా తలారి గౌతమి సోమశేఖర్

కళ్యాణదుర్గం, (చైతన్యరథం): కుల రాజకీయాలు చేయడం మా సంస్కృతి కాదని కళ్యాణదుర్గం మునిసిపల్ కౌన్సిలర్లు వెల్లడించారు. వాల్మీకి సామాజికవర్గానికి చెందిన తలారి గౌతమిని మున్సిపల్‌చైర్మన్‌గా ఎన్నుకున్నామని వెల్లడించారు. అభివృద్ధికి అండగా నిలిచిన కౌన్సిలర్లు అందరికీ ఎమ్మెల్యే అమిలినేని ధన్యవాదాలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి వైసీపీ ఎంత అడ్డగించిన కళ్యాణదుర్గం రూపు రేఖలు మార్చడమే ధ్యేయమని ఎమ్మెల్యే అమిలినేని పేర్గొన్నారు. వెల్లడించారు. ఎమ్మెల్యే అమిలినేని అభివృద్ధితో కళ్యాణదుర్గం రూపు రేఖలు మారనున్నాయని కౌన్సిలర్లు తెలిపారు. మున్సిపాలిటీ తెలుగుదేశం కైవసం చేసుకోవడంతో తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబారాలు చేసుకున్నారు. అభివృద్ధిలో వెనుకబడిన కళ్యాణదుర్గాన్ని అభివృద్ధిలో ముందుకు నడుపుతామన్నారు. 11 అనేది వైసీపీకి అచ్చొచ్చిన నంబరన్నారు. ఇక్కడ కూడా 11 మందే వచ్చారన్నారు. అది కూడా 11 తారీకు కావడం విశేషమని ఎద్దేవా చేశారు.

# వైఎస్ సునీత పోరాటానికి మద్దతుగా నిలుస్తాం

## కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



కదిరి, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీనే కాదు ఎమ్మెల్యే అని కాదు, కనీస మానవతా విలువలు ఉన్న ప్రతి వ్యక్తి కూడా వైఎస్ సునీత చేస్తున్న పోరాటానికి అండగా ఉంటున్నారు మద్దతుగా నిలుస్తున్నారని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఆమె నిజంగా యంగ్ స్టార్స్ అయితే నెక్స్ట్ జనరేషన్ వాళ్లు అయితే వందకు వందశాతం ఒక ఇన్స్పిరేషన్ గా చూస్తున్నారన్నారు. ఈ యుద్ధంలో ఆమె గెలిస్తే న్యాయం గెలుస్తుందన్నారు.

ఏం పదవి రాదు లేదా రాజకీయాలు లేవన్నారు. ఆమె చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని నిర్ణయించుకున్నానన్నారు. ఆమెకు మద్దతుగా సంతకాలు సేకరణ చేపడతామన్నారు. న్యాయం గెలిచే వరకు మద్దతుగా నిలుస్తామని కందికుంట ప్రకటించారు.

## ఘనంగా ఏబీ వాజ్‌పాయి విగ్రహావిష్కరణ

ధర్మవరం, (చైతన్యరథం): ఘనంగా అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహావిష్కరణ జరిగింది. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు,ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనలను అనుసరించి ఉదయం 11 గంటలకు ధర్మవరం పట్టణం కాలేజీ సర్కిల్లో వాజ్ పేయి విగ్రహ ఆవిష్కరణ పురస్కరించుకొని ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు రాప్తాడు పరిటాల సునీతమ్మ, ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొని విజయవంతం చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.





## మల్లన్న సన్నిధిలో అఖండ బృందం

శ్రీశైలం, (చైతన్యరథం): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను గురువారం 'అఖండ-2' చిత్రబృంద సభ్యులు దర్శించుకున్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను, సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్లకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం దర్శకుడు బోయపాటి మాట్లాడుతూ నేటి నుంచి ప్రీమియర్ షో తో 'అఖండ-2' సినిమా ప్రారంభమవుతుందని, శుక్రవారం నుంచి 'అఖండ-2'ను ప్రేక్షకులు వీక్షించవచ్చని తెలిపారు.

# అన్నదాతకు చుర్రుమంటున్న అమెరికా అధ్యక్షుడి చర్యలు



కర్నూలు, (చైతన్యరథం): భారత్ నుంచి దిగుమతయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధించే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు వార్తలు రావడంతో జిల్లా రైతులు కలవరింతకు గురవుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగయ్యే కర్నూలు, నంద్యాల సోనా మసూరి బియ్యానికి ఎంతో ఆదరణ ఉంది.. సన్నగా ఉండే ఈ బియ్యం నాణ్యతగా.. రుచికరంగా ఉంటాయని పేరుంది. విదేశాల్లోనూ డిమాండ్ ఉంటోంది. వ్యాపారులు ఇక్కడ బియ్యం కొనుగోలు చేసి విదేశాలకు రవాణా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 20 మంది బడా వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు. తుంగభద్ర దిగువ, గాజులదిన్నె, కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, హంద్రీనీవా కింద సోనా రకాలు 2.07 లక్షల హెక్టార్లలో సాగు చేస్తుంటారు. ప్రస్తుతం అమెరికాలోని సూపర్ మార్కెట్ లో ఒక పౌండ్ (453 గ్రాములు) బియ్యం ఒక డాలర్ (మన దేశ కరెన్సీలో రూ.90) పలుకుతోంది. కిలో (వెయ్యి గ్రాములు) దాదాపుగా రూ.200 వరకు పలుకుతోంది. ట్రంప్ చర్యలను ఆసరా చేసుకొని వ్యాపారులు ధరలను తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది క్వింటా ధర రూ.1500 దాటలేదు. ఇప్పుడు మరీ అధ్వానంగా 78 కేజీల (సంచితో కలిపి) వద్ద బస్తా రూ.1400 నుంచి 1450 (క్వింటా రూ.1820 రూ.1880లోపు) మధ్యలోనే దళారులకు విక్రయిస్తున్నారు.



బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రత్యక్షంగా విని సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు.

# అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో సరికొత్త చరిత్ర

## వచ్చే ఏడాది రోదసీలోకి మానవసహిత వాహనాలు



అంతరిక్ష ప్రయోగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్న ఇస్రో సరికొత్త చరిత్రను లిఖించేందుకు అడుగులు వేస్తోంది. ప్రతిష్టాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిస్థాయిలో పట్టాలెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇందుకు రూట్ మ్యాప్ ఇప్పటికే పూర్తికాగా, 2027లో మానవసహిత యాత్ర చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2035 నాటికి రోదసిలో భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 5 మాడ్యూళ్లను అనుసంధానించి సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ ప్రాజెక్టుల వివరాలను ఇస్రోలో భాగమైన అహ్మదాబాద్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (శాక్) డైరెక్టర్ నీలేష్ ఎం దేశాయ్ వెల్లడించారు. అహ్మదాబాద్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ దేశంలో మిగిలినవాటితో పోలిస్తే ప్రత్యేకమైంది. ప్రయోగించే వాహక నౌకల్లోని అన్ని పేలోడ్లు ఇక్కడ తయారవుతాయి. 15 రోజుల ముందే తుపానుల సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేస్తున్నాం. మత్స్యకారుల ప్రాణాలు కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నాం. 2022లోనే గగన్యాన్ మిషన్ పూర్తిచేయాలని ప్రధాని మోదీ ఆదేశించారు. కానీ కోవిడ్, కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యమైంది. ఇప్పుడు మొట్టమొదటి మానవరహిత గగయాన్ మిషన్ 2026 ఫిబ్రవరిలో రోదసిలోకి పంపిస్తాం. మరో రెండు మానవరహిత మిషన్లు అదే ఏడాదిలో ప్రయోగిస్తాం. 2027లో నాలుగో మానవరహిత మిషన్‌ను పంపించి ఫలితాలను విశ్లేషించుకుంటాం. వాటి ఆధారంగా మానవసహిత మిషన్ 2027 డిసెంబర్లో పంపిస్తాం.గగన్ యాన్‌కు వైమానికదళం నుంచి నలుగురిని తీసుకున్నారు. ఇందులో ఒకరిని వ్యోమగామి శిక్షణకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపాం. ముగ్గురు శిక్షణ పొందుతున్నారు. గగన్యాన్ కింద ఎందరిని పంపాలన్న దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కొంతకాలం అంతరిక్షంలో ఉండి నేల మీదకు వచ్చాక (భారరహిత స్థితి నుంచి గురుత్వాకర్షణ శక్తి పరిధిలోకి రావడం వల్ల) వ్యోమగాముల శారీరక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉంది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం అందుబాటులోకి వస్తే రోదసిలోకి పంపించే మానవసహిత వాహనాలు అక్కడ ఆగుతాయి. ఈ అంతరిక్ష కేంద్రం భారత్‌కు ఒక మజిలీగా ఉపయోగపడుతుంది.




# భారత్ అభివృద్ధికి మేం ఉత్ప్రేరకమవుతాం : అమెజాన్

## 2030 నాటికి 3.15 లక్షల కోట్ల పెట్టుబడులు

అమెరికా ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్, 2030 కల్లా మనదేశంలో 35 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.15 లక్షల కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించింది. బుధవారం జరిగిన 'అమెజాన్ సంభవ్ సమిట్'లో ఈ విషయాన్ని తెలిపింది. అమెరికా ఐటీ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, గూగుల్ ప్రకటించిన మొత్తానికి సమానంగా అమెజాన్ ఒక్కటే ఇంత భారీ పెట్టుబడులు ప్రకటించడం విశేషం. క్విక్ కామర్స్‌తోపాటు క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ)లో వ్యాపారాన్ని విస్తరించడం కోసం వీటిని వినియోగించనుంది. పోటీని తట్టుకోవడం కోసమే కృత్రిమ మేధ, లాజిస్టిక్స్ మౌలిక వసతులపై 2030లోగా ఈ పెట్టుబడులను అమెజాన్ పెట్టనుంది. తద్వారా భారత్లో 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని పేర్కొంది. వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్టుతోపాటు దేశీయ సంస్థలైన జియోమార్ట్, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్ జెప్టోలకు పోటీనివ్వడం కోసం అమెజాన్ ఇక్కడ పెట్టుబడులు పెంచుతోంది. 2010 నుంచి ఇప్పటిదాకా 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.60 లక్షల కోట్ల)ను అమెజాన్ వెచ్చించింది. 2023 లోనూ 26 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.34 లక్షల కోట్ల) పెట్టుబడులను ప్రకటించింది. తాజా పెట్టుబడులతో భారత్లోని విక్రేతల ఎగుమతులు 2030 కల్లా 80 బి. డాలర్ల (సుమారు రూ.7.20 లక్షల కోట్ల)కు చేరడానికి ఉపయోగపడతాయి. 'భారత వృద్ధికి మేం ఒక ఉత్ప్రేరకంగా ఉండడాన్ని కొనసాగిస్తాం. కోట్ల మంది భారతీయులకు ఏఐని దగ్గర చేస్తాం'ని అమెజాన్ హెడ్ ఆఫ్ ఎమర్జింగ్ మార్కెట్స్ అమిత్ అగర్వాల్ అన్నారు.

# ఓటు లేదంటే గరిటె తిరగేయండి

## ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా బెంగాల్ మహిళలకు మమత పిలుపు



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ గురువారం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా మహిళలకు ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో పేర్లు తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యలు చేశారు. "ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే.. మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయి కదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది.

రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, వంటివారు ఏనాడూ ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్ర్యం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు. ఇప్పుడు భారత పౌరులుగా నిరూపించుకోవాలి" అని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానగర్ ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ భాజపా కమిషన్'గా మారిందని, ఢిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భాజపా ఎంపీలకు ఇటీవల ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు.

# గోవా నైట్‌క్లబ్ అగ్నిప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం

## పోలీసుల అదుపులో లూథ్రా సోదరులు

గోవా నైట్ క్లబ్ అగ్నిప్రమాదంపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితులు, క్లబ్ యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి అధికారులు వారిని అదుపులోకి తీసుకున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం. నెల 6న రాత్రి 11.45 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకోగా, నిందితులిద్దరూ 7న ఉదయం 5.30 గంటలకు ఓ విమానంలో థాయ్‌లాండ్‌కు పారిపోయినట్లు ముంబయిలోని 'బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్' గుర్తించినట్లు ఇప్పటికే పోలీసులు తెలిపారు. వారి పాస్‌పోర్టులు సస్పెండ్ అయిన నేపథ్యంలో ఆ దేశంలో ఉండటం చట్టవిరుద్ధం. దాంతో అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని 24 గంటల్లో భారత్‌కు తరలించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



కాగా, గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 25 మంది మృతి చెందారు. సిలిండర్ పేలుడుకు బాణసంచా తోడు కావడంతో తీవ్రత పెరిగింది.

# ఐఆర్‌టీసీ యూజర్ ఖాతాల ఏరివేత

## తత్కాల్ టికెట్ల జారీ విషయంలో ఇటీవల అనేక మార్పులు, లోక్‌సభలో వెల్లడించిన రైల్వేమంత్రి అశ్వని వైష్ణవ్



తత్కాల్ టికెట్ల జారీ విషయంలో ఇటీవల అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఐఆర్‌టీసీ ఖాతాల ఏరివేతను అదే స్థాయిలో చేపట్టింది. ఇందులో భాగంగా ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 3.02 కోట్ల అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అక్మాయ్ వంటి యాంటీ బాట్ టెక్నాలజీని వినియోగించి నకిలీ, ఆటోమేటెడ్ ప్రయత్నాలను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ఆయన ఓ ప్రశ్నకు ఆయన గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సామాన్యులకు సాధారణ, తత్కాల్ టికెట్లు అందేలా రిజర్వేషన్ వ్యవస్థ తీర్చిదిద్దేందుకు అనేకచర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. తత్కాల్ వ్యవస్థలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఆధార్‌బేస్డ్ ఓటీపీ వ్యవస్థను దశలవారీగా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం 322 రైళ్లకుదీన్ని వర్తింపజేశామన్నారు.

దీని ద్వారా ఆయా రైళ్లలో తత్కాల్ టికెట్ల అందుబాటు సమయందాదాపు 65 శాతం మేర పెరిగిందని చెప్పారు. అలాగే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తత్కాల్ బుకింగ్స్ కుఓటీపీ వెరిఫికేషన్ విధానాన్ని ఈ నెల 4 వరకు 211 రైళ్లకు వర్తింపజేసినట్లు తెలిపారు. దీనివల్ల 96 పాపులర్ ట్రైన్ల టికెట్ల అందుబాటు సమయం 95 శాతం మేర పెరిగిందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

# అది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే

## అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులకు భారత్ ఖండన

అఫ్గానిస్థాన్ పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడటాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. చిన్నారులు, మహిళలు, క్రికెటర్లపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చల్లో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఐక్యరాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుంది. అమాయకులైన పౌరుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరికాదు. క్లిష్టపరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్‌పై బహిరంగ బెదిరింపులు, యుద్ధచర్యలు వంటివి అంతర్జాతీయ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమే. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అఫ్గానిస్తాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను తాము సమర్థిస్తున్నామని ఉద్ఘాటించారు. అక్కడి భద్రతా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర సంస్థలు సరిహద్దు ఉగ్రవాదంలో పాల్గొనకుండా చేయాలని పిలుపు నిచ్చారు. అఫ్గాన్ ప్రభుత్వంతో సంబంధాలుపెంచుకోవడంపై భారత వైఖరిని ఉద్ఘాటించారు.



# అమెరికాలో మోదీ-పుతిన్ ఫొటో వైరల్

**- స్పందించిన చట్టసభ సభ్యురాలు సిడ్నీ కమ్లాగర్ దువ్**
**- ట్రంప్‌నకు నోబెల్ రాదు అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు**

రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన మోదీ–పుతిన్ల మధ్య స్నేహబంధాన్ని మరోసారి వెల్లడి చేసింది. పుతిన్ భారత్‌లో దిగగానే మోదీ ఆయనకు స్వాగతం పలికి కారులో కలిసి వస్తున్నప్పుడు తీసుకున్న సెల్ఫీ వైరల్ అయింది. ఇప్పుడు ఆదే ఫొటో అమెరికా రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఒక్క చిత్రం ఎన్నో ఆర్థాల్ని వెల్లడి చేస్తోందని అగ్రరాజ్య చట్టసభ సభ్యురాలు సిడ్నీ కమ్లాగర్ దువ్ హెచ్చరించారు. భారత్‌పై ట్రంప్ యంత్రాంగం వైఖరిని ఆమె ప్రశ్నించారు. ట్రంప్ విధానాలు ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక విశ్వాసం, పరస్పర అవగాహనను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. అవి అమెరికాకే హాని చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా వ్యూహాత్మక భాగస్వాములను శత్రువుల చేతిలోకి నెట్టడం ద్వారా మీకు నోబెల్ రాదు" అని ట్రంప్‌ను ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వాషింగ్టన్ మేల్కొనాలని సెల్ఫీని ఉద్దేశించి ఆమె పిలుపు నిచ్చారు. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. ఢిల్లీ విమానాశ్రయంలో దిగగానే రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. ఆయన్ను మోదీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ తమ కాన్వాయ్ ను వదిలి, టయోటా ఫార్చ్యూనర్లో ప్రధాని అధికారిక నివాసం వరకు కలిసి ప్రయాణించడం చర్చనీయాంశమైంది. "ఆ కారు రైడ్ నా ఆలోచన. మా స్నేహానికి చిహ్నం. ఆ సమయంలో మేం మాట్లాడుతూనే ఉన్నాం. చర్చించుకోవడానికి ఎప్పుడూ ఏదోఒక అంశం ఉంటుంది" అని ఆ రైడ్ గురించి పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. రష్యా చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన



నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అమెరికా వ్యవహార శైలి... భారత్ను రష్యా వైపునకు నెట్టివేస్తోందని సిడ్నీ విమర్శించారు.

**ట్రంప్ విధానాలపై అసంతృప్తి...**

– టారిఫ్ వల్ల అమెరికా, భారత ప్రజలు సవాళ్లు ఎదుర్కొంటున్నారని చట్టసభ సభ్యురాలు ప్రమీలా జయపాల్ పేర్కొన్నారు. అవి భారత ఆర్థిక వ్యవస్థను, అమెరికా వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

– భారత్–అమెరికా సం బంధాలపై అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ అమెరికా ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ ధ్రువ జైశంకర్ మాట్లాడారు. పాకిస్థాన్ సైనిక నాయకత్వంపై ట్రంప్ యంత్రాంగం చూపుతోన్న అభి మానాన్ని ఆయన ప్రశ్నించారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసే పాక్‌తో ఇలాంటి సంబం ధాలను ఆయన వ్యతిరేకించారు.

– భారత్ వేగంగా వృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని మరో చట్టసభ సభ్యుడు బిల్ హుయిజెంగా అన్నారు. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ పరిరక్షణకు భారత్ అవసరాన్ని నొక్కి చెప్పారు భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై హౌస్ ఫారిన్ అఫైర్స్ సౌత్ అండ్ సెంట్రల్ ఏషియా సబ్ కమిటీ ముందు తమ ఆందోళనలను వ్యక్తంచేశారు.



## ఉక్రెయిన్‌లో శాంతి కోసం..
## మాస్కోకు అనుకూలంగా ట్రంప్ ఆఫర్లు!

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్నటివరకు కాల్పుల విరమణకు అంగీకరించాలని రష్యాపై ఆంక్షలు విధిస్తూ ఒత్తిడి తెచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రంప్ తన విధానాన్ని మార్చుకున్నట్లుగా ఉంది. మాస్కోకు అనుకూలంగా కొన్ని ఆఫర్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వాల్ట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. కథనం ప్రకారం.. ఇటీవల యూరోపియన్ దేశాలకు అందజేసిన శాంతి ప్రణాళికలో అనుబంధంగా ట్రంప్ తాజా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో ఐరోపా దేశాలకు రష్యా నుంచి ఇంధన సరఫరాను పునరుద్ధరించాలనేది కూడా ఒకటి. ఆ దేశంలోని అరుదైన ఖనిజ రంగాల్లో పెట్టుబడులు పెట్టడంతో పాటు.. స్తంభింపజేసిన రష్యా ఆస్తుల విడుదల వంటి పలు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిలోనే అమెరికా వ్యాపార, ఆర్థిక సంస్థలు స్తంభింపజేసిన రష్యా సావరిన్ ఫండ్ నిధులను ఉక్రెయిన్లో ప్రాజెక్టులకు వినియోగించే ప్రణాళిక ఉంది. జపోరిజియా అణు విద్యుత్తు కేంద్రం శక్తితో ఓ డేటా సెంటర్ ఏర్పాటు వంటి అంశాలున్నాయి. రష్యాలోని అరుదైన ఖనిజాల వెలికితీత, చమురు తవ్వకం వంటి వ్యూహాత్మక రంగాల్లో అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టే విషయాన్ని ప్రస్తావించారు. రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం ముగించేందుకు ట్రంప్ ఇటీవల 28 సూత్రాలతో శాంతి ప్రణాళికను రూపొందించారు. ఇందులో ఎక్కువ అంశాలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయని నాటో దేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ క్రమంలో ఇందులో సవరణలు సూచించాయి. ఈ శాంతి ప్రణాళికను ముందుకు తీసుకెళ్లే అంశంపై అగ్రరాజ్యం మధ్యవర్తిత్వంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల్లో కీవ్ నుంచి సరైన స్పందన రాకపోవడంపై ట్రంప్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కి శాంతి ప్రతిపాదనను ఇంకా చదవకపోవడం తనను నిరాశ పరిచిందన్నారు. ఆ దేశ ప్రజలు ఇష్టపడుతున్న దీన్ని.. జెలెన్ స్కీ మాత్రం అంగీకరించడం లేదన్నారు.

# అమెరికా బాటలో మెక్సికో

**- సుంకాల పెంపు ప్రతిపాదనలకు సెనెట్ ఆమోదం**
**-చైనా, భారత్‌లపై ప్రభావం**



దిగుమతి వస్తువులపై సుంకాలకు సంబంధించి అమెరికా బాటలోనే మెక్సికో వెళ్తున్నట్లు తెలుస్తోంది. తమ దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఎంపిక చేసిన వస్తువులపై సుంకాలను భారీగా పెంచేందుకు మెక్సికో ప్రభుత్వం సిద్ధమైంది. ఇందు కు సంబంధించిన ప్రతిపాదనలకు అక్కడి సెనెట్ ఆమోదం తెలిపింది. చైనా, భారత్ సహా పలు ఆసియా దేశాలకు చెందిన దాదాపు 1400 వస్తువులపై సుంకా లు 50 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. వచ్చే జనవరి 1 నుంచి ఇవి అమ ల్లోకి రానున్నాయి. చైనా, భారత్, దక్షిణ కొరియా, థాయ్లాండ్, ఇండోనేసియా తో సహా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని ఇతర ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆటోమొబైల్స్, విడిభాగాలు, టెక్స్టైల్స్, దుస్తులు, ప్లాస్టిక్, స్టీలు తదితర వస్తువులపై దాదాపు సుంకాలు పెంచాలని మెక్సికో ప్రతిపాదించింది. వీటిని అక్కడి ఆర్థికమంత్రి సెప్టెంబర్లోనే ప్రవేశపెట్టారు. అయితే, చట్టసభలో అధికార మోరెనా పార్టీకి మెజార్టీ ఉన్నప్పటికీ అప్పుడు మద్దతు పొందలేకపోయింది. తాజాగా ఇందుకు గ్రీన్ సిగ్నల్ లభించడంపై అధ్యక్షురాలు క్లాడియా షీన్బామ్ స్పందించారు. దేశీయ ఉత్పత్తి పెంచడం, చైనాతో వాణిజ్య సమతుల్యత సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు క్లాడియా తెలిపారు. అయితే, అమెరికా–మెక్సికో–కెనడా వాణిజ్య ఒప్పందం తదుపరి సమీక్షకు ముందే ఈ చర్యలు తీసుకోవడం ఆసక్తిగా మారింది. మెక్సికోను ఉపయోగించుకొని చైనా బ్యాక్ డోర్‌లో అమెరికా మార్కెట్లో కి ప్రవేశిస్తుందని ట్రంప్ యంత్రాంగం ఆరోపిస్తున్న విషయం తెలిసిం దే. ఈ క్రమంలో అమెరికాను బుజ్జగించేం దుకే క్లాడియా ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించిందని విశ్లేషకులు, ప్రైవేటు రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

## ట్రంప్‌నకు మోదీ ఫోన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ఇరువురు నేతలూ చర్చించినట్టు తెలుస్తోం ది. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన తర్వాత.. ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయ డంపై సర్వత్రా ఆసక్తి రేపుతోంది. భారత్–అమెరికాల మధ్య వాణిజ్య సంబంధాలు, ప్రపంచ పరిణామాలపై ట్రంప్‌తో మోదీ మాట్లాడినట్టు సమాచారం. అలాగే ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంపై కూడా ఇరు నేతలూ చర్చించినట్టు తెలుస్తోంది. వ్యాపారం, సాంకేతికత, రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై సంభాషణ జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే.. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన ముగిసిన రోజుల వ్యవధిలోనే మోదీ ట్రంప్‌తో ఫోన్ చేసి మాట్లాడటంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.



# మురికిగా ఉండే జనాన్నే తెచ్చుకున్నాం

**- ట్రంప్ జాత్యాంహకార వ్యాఖ్యలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వలసల గురించి మాట్లాడే క్రమంలో ఆఫ్రికా దేశాల పౌరుల గురించి జాత్యాహంకార వ్యాఖ్యలు చేశారు. తాము వలసలను భారీగా తగ్గించామని, అందువల్లే గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అమెరికన్లకు ఎక్కువ ఉద్యోగావకాశాలు, మంచి వేతనాలు దక్కుతున్నాయని అన్నారు. పెన్సిల్వేనియాలోని మౌంట్ పొకానోలో మంగళవారం జరిగిన సభలో ట్రంప్ ప్రసంగించారు. 'నార్వే, స్వీడన్, డెన్మార్క్ దేశాల నుంచి అమెరికాకు ఎందుకు వలసలు లేవు. ఆ దేశానికి చెందిన వారిని మనం ఎందుకు ఆకర్షించలేకపోయాం. మనం ఎప్పుడూ సోమాలియా లాంటి దేశాల వారికే ఆశ్రయ మిస్తున్నాం. మురికిగా, అసహ్యంగా, నేరాలతో నిండిపోయిన వారినే అంగీకరిస్తున్నాం. వారి నైపుణ్యం కేవలం ఓడలను వెంటాడడమే. తొలిసారిగా రివర్స్ మైగ్రేషన్ జరుగుతోంది. అఫ్గానిస్థాన్, హైతీ, సోమాలియా తదితర దేశాల నుంచి వచ్చే జనాలను అడ్డుకుంటున్నాం' అని ట్రంప్ వెల్లడించారు. ఇక, భారత్–పాకిస్థాన్ మధ్య జరగాల్సిన అణు యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 70వ సారి పునరుద్ఘాటించారు. 10 నెలల్లో ఎనిమిది యుద్ధాలను ఆపానని, ఇజ్రాయెల్, ఇరాన్, ఈజిప్టు, ఇథియోపియా, ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లలో శాంతిని స్థాపించానని అన్నారు. అలాగే అణ్వస్త్ర దేశాలైన భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, కొసావో–సెర్బియా యుద్ధాన్ని అడ్డుకున్నానని చెప్పారు. థాయ్‌లాండ్–కంబోడియా యుద్ధ రంగంలోకి దిగకుండా అడ్డుకున్నానని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు.

# భారత్‌కు వెళ్లొద్దు

**- హెచ్-1బీ వీసాదారులకు**
**ఇమిగ్రేషన్ లాయర్ల సూచనలు**

భారత్‌లో డిసెంబర్‌లో జరగాల్సిన వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాదికి అమెరికా వాయిదా వేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఇంటర్వ్యూలు ఉండొచ్చంటూ ఇటీవల అకస్మాత్తుగా లబ్ధిదారులకు సందేశాలు పంపించింది. సోషల్ మీడియా అకౌంట్స్ పరిశీలన నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. దీంతో, అమెరికాలోని హెచ్–1బీ వీసాదారులకు అక్కడి ఇమిగ్రేషన్ లాయర్లు కీలక సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు వెళ్లడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు.

# దుమ్మురేపిన డికాక్



**రెండో టీ 20లో సౌతాఫ్రికా ఘన విజయం - 51 పరుగులతో ఓడిన టీమిండియా - దక్షిణాఫ్రికా 213/4, భారత్ 162 ఆలౌట్**

తొలి టీ 20లో ఎదురైన దారుణ పరాభవానికి దక్షిణాఫ్రికా బదులు తీర్చుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా గురువారం జరిగిన రెండో టీ20లో టీమిండియాను 51 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేయగా.. ఛేదనలో ఆదిలోనే చేతులెత్తేసిన టీమిండియా 19.1 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటై పరాజయంపాలైంది. సౌతాఫ్రికా తరపున బ్యాటింగ్లో డికాక్ (90), బౌలింగ్లో ఓట్నీల్ బార్ట్మన్ (4-0-24-4) చెలరేగారు. భారత ఇన్నింగ్స్‌లో తిలక్ వర్మ (62, 34 బంతుల్లో, 2 ఫోర్లు, 5 సిక్సులు) ఒంటరిపోరాటం చేశాడు. ఈ గెలుపుతో సౌతాఫ్రికా 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది.

214 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఏ దశలోనూ గెలుపు అవకాశాలు సృష్టించుకోలేకపోయింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (17, 8 బంతుల్లో, 2 సిక్సులు), శుభ్‌మన్ గిల్ (0) నిరాశ పరిచారు. లుంగీ ఎంగిడి బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే అవుటై గిల్ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5, 4 బంతుల్లో, 1 ఫోర్) మరోసారి విఫలమయ్యాడు. అక్షర్ పటేల్ (21, 21 బంతుల్లో, 1 ఫోర్, 1 సిక్స్), హార్దిక్ పాండ్య (20, 23 బంతుల్లో, 1 సిక్స్), వేగంగా ఆడలేక పోయారు. జితేష్ శర్మ (27, 17 బంతుల్లో, 2 ఫోర్లు, 2 సిక్సులు) దూకుడుగా ఆడినా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. శివం దూబె (1), అర్షదీప్ సింగ్ (4), వరుణ్ చక్రవర్తి (0). జస్‌ప్రీత్ బుమ్రా (0) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు.

**డికాక్ దూకుడు**

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ఓపెనర్ క్వింటన్ డికాక్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో విరుచుకుపడటంతో.. నిర్ణీత ఇరవై ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేయగలిగింది. వరుణ్ చక్రవర్తి తన తొలి ఓవర్ తొలి బంతికే ఓపెనర్ రీజా హెంగ్రిక్స్ (8) అవుటయినా మరో ఓపెనర్ క్వింటన్ డికాక్ దూకుడుగా ఆడాడు. కేవలం 26 బంతుల్లోనే యాభై పరుగులు పూర్తి చేసుకున్నాడు. అయితే, 90 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్ కావడంతో డికాక్ సెంచరీ మిస్సయ్యాడు. వరుణ్ చక్రవర్తి బౌలింగ్లో లేని పరుగుకు యత్నించి మూల్యం చెల్లించాడు. ఈ క్రమంలో మొత్తంగా 46 బంతులు ఎదుర్కొన్న డికాక్. ఐదు ఫోర్లు, ఏడు సిక్సర్ల సాయంతో 90 పరుగులు సాధించాడు. డికాక్‌కు తోడుగా కెప్టెన్, వన్‌డౌన్ బ్యాటర్ ఐడెన్ మార్క్రమ్ (26 బంతుల్లో 29) ఓ మోస్తరుగా రాణించాడు. రెండో వికెట్‌కు డికాక్‌తో కలిసి 83 పరుగులు జోడించాడు. చిచ్చరపిడుగు డెవాల్డ్ బ్రెవిస్ (14) విఫలం కాగా.. ఆఖర్లో డొనోవాన్ ఫెరీరా (16 బంతుల్లో 30), డేవిడ్ మిల్లర్ (12 బంతుల్లో 20) ధనాధన్ బ్యాటింగ్‌తో అజేయంగా నిలిచారు.

భారత బౌలర్లలో స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి రెండు, అక్షర్ పటేల్ ఒక వికెట్ దక్కించుకున్నారు. డికాక్‌ను వికెట్ కీపర్ జితేశ్ శర్మ రనౌట్ చేశాడు. ఎక్స్‌ట్రాల రూపంలో సౌతాఫ్రికాకు భారత్ 22 పరుగులు సమర్పించుకుంది. భారత పేసర్లలో అర్షదీప్ సింగ్ అత్యధికంగా నాలుగు ఓవర్ల కోటాలో 54 పరుగులు ఇచ్చుకోగా.. జస్ప్రీత్ బుమ్రా 45 పరుగులు సమర్పించుకున్నాడు. హార్దిక్ పాండ్యా మూడు ఓవర్లలో 34, శివం దూబే రెండు ఓవర్లలో 18 పరుగులు ఇవ్వగా.. వరుణ్ పూర్తి కోటాలో 29 రన్స్ మాత్రమే ఇచ్చి రెండు.. అక్షర్ మూడు ఓవర్లలో 27 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టారు. అర్షదీప్ ఒకే ఓవర్‌లో ఏకంగా ఏడు వైడ్స్ వేసి చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు.

**12 ఇన్నింగ్స్ లోనే**

ఈ ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టీ20లలో టీమిండియాపై అత్యధికసార్లు (5) ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు సాధించిన ఆటగాళ్ల జాబితాలో డికాక్ చేరాడు. డికాక్ కంటే ముందు వెస్టిండీస్ స్టార్ నికోలస్ పూరన్, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ ఈ ఘనత సాధించారు. అయితే, ఇందుకు పూరన్‌కు 20 ఇన్నింగ్స్.. బట్లర్‌కు 24 ఇన్నింగ్స్ అవసరం కాగా.. డికాక్ 12 ఇన్నింగ్స్ లోనే ఈ ఫీట్ అందుకున్నాడు.

## మెస్సీతో ఫొటో దిగాలంటే

# రూ.12 లక్షలు!



ఫుట్‌బాల్ సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ భారత్ రానుండడం.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయింది. అందులోనూ అతను హైదరాబాద్‌లో అడుగుపెట్టనుండడం.. ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డితో పాటు సెలెబ్రిటీలంతా సాకర్ దిగ్గజంతో కలిసి మైదానంలో కాలు కదపనుండడం.. తారలతో కలిసి మ్యాచ్‌లు, సంగీత కచేరీలు, సత్కార వేడుక.. ఇలా మెస్సీ పర్యటన షెడ్యూల్ ఆద్యంతం అత్యంత ఆకర్షణీయంగా మారనుంది. సాకర్ మాంత్రికుడి మెరుపులను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులంతా ఇప్పుడు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగే మెస్సీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కోసం ఇప్పటికే టిక్కెట్లన్నీ దాదాపు అమ్ముడయ్యాయన్నది నిర్వాహకుల మాట. మెస్సీ ఆటను దగ్గరుండి చూడడమే గాకుండా అతడిని స్వయంగా కలిసి ఫొటోలు దిగే అవకాశం కూడా అభిమానులకు ఉంది. అయితే, అందుకు భారీగా వెచ్చించాల్సి ఉంటుంది.

**మీట్ అండ్ గ్రీట్..**

మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం కింద అభిమానులతో మెస్సీ ముచ్చటించే కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను ఒక్కో అభిమానికి రూ. 9.95 లక్షలుగా ధర నిర్ణయించారు. దీనికి జీఎస్టీ అదనం. అంటే.. మెస్సీతో ఫొటో దిగాలంటే దాదాపు రూ. 12 లక్షల దాకా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫొటోతో పాటు మెస్సీ సంతకం చేసిన అర్జెంటీనా జట్టు జెర్సీని కూడా అందజేస్తారు.

**మెస్సీ టూర్ ప్రోగ్రాం ఇదే**

మెస్సీ డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో దేశ వ్యాప్తంగా నాలుగు ప్రముఖ నగరాల్లో పర్యటిస్తారు. గోట్ (జీవోఏటీ) ఇండియా టూర్ 2025లో భాగంగా ఆయన కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, న్యూఢిల్లీల్లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇండియా టూర్ ముగించే ముందు దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మెస్సీ కలుస్తారు. మెస్సీతో పాటు లూయిస్ సూరెజ్, అర్జెంటినా మిడ్ ఫీల్డర్ రోడ్రిగో డే పాల్‌లు కూడా భారత్‌లో పర్యటించనున్నారు. మెస్సీ మూడు రోజుల భారత్ టూర్ షెడ్యూల్ ఇలా ఉంది..

**డిసెంబర్ 13, కోల్‌కతా..**

తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతాల్లో కోల్‌కతా చేరుకుంటారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు మీట్ అండ్ గ్రీట్ ప్రోగ్రామ్ ఉంటుంది. 10.30 నుంచి 11.15 గంటల వరకు వర్చ్యువల్‌గా మెస్సీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 11.15 నుంచి 11.25 వరకు యువ భారతికి వెళతారు. హిందీ నటుడు షారుఖ్ ఖాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 12 గంటలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సౌరభ్ గంగూలీ స్టేడియం దగ్గరకు వస్తారు. 12 గంటల నుంచి 12.30 గంటల వరకు ఫ్రెండ్లీ మ్యాచ్, సన్మానం, ఇంటరాక్షన్ ఉంటుంది. 2.00 గంటలకు హైదరాబాద్ బయలు దేరతారు.

**డిసెంబర్ 13, హైదరాబాద్..**

రాత్రి 7.00 గంటల ప్రాంతంలో రాజీవ్ గాంధీ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో పాల్గొంటారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మ్యాచ్ ఆడనున్నారు. అనంతరం మ్యూజికల్ కన్సర్ట్‌లో పాల్గొంటారు.

**డిసెంబర్ 14, ముంబై..**

3.30 గంటలకు క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగే పడేల్ కప్‌లో పాల్గొంటారు. 4.00 గంటలకు సెలెబ్రిటీ ఫుట్ బాల్ మ్యాచ్ ఉంటుంది. 5.00 వాంఖడే స్టేడియంలో ఛారిటీ ఫ్యాషన్ షో ఉంటుంది.

**డిసెంబర్ 15, న్యూఢిల్లీ..**

ప్రధాని నరేంద్ర మోదీతో మెస్సీ భేటీ కానున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో అర్జున్ జైట్లీ స్టేడియంలో జరిగే మినర్వా అకాడమీ ప్లేయర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు.



## ఏ కేటగిరీలోకి రోహిత్, కోహ్లి?

టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు బీసీసీఐ షాక్ ఇవ్వనున్నట్లు సమాచారం. వీరిద్దరికి సంబంధించిన సెంట్రల్ కాంట్రాక్ట్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 2024 - 25 సీజన్‌లో కోహ్లి, రోహిత్ ఏ ప్లస్ కేటగిరీలో ఉన్నారు. గత ఏడాది వీరిద్దరూ టెస్టులు, టీ20ల నుంచి రిటైర్ అయ్యి, ఇప్పుడు కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే 2025-26 సీజన్ లో వీరిని ఏ ప్లస్ కేటగిరీ నుంచి గ్రేడ్ ఏ కేటగిరీకి డిమోట్ చేసేస్తారని వినిపిస్తుంది. అదే జరిగితే వారి జీతంలో సుమారు రూ.2 కోట్లు తగ్గుతాయి. డిసెంబర్ 22న జరిగే బీసీసీఐ అపెక్స్ కాన్సెల్ వార్షిక సమావేశంలో ఈ ఇద్దరి కాంట్రా క్టుల విషయం ప్రధాన ఎజెండాగా ఉండనుందని తెలుస్తోంది.

ప్రస్తుతం వార్షిక కేటగిరీల వారిగా ఫీజుల వివరాలు చూస్తే.. ఏ ప్లస్ కేటగిరిలో ఉన్న ప్లేయర్లకు రూ.7 కోట్లు, ఏ కేటగిరీ రూ.5 కోట్లు, బీ కేటగిరీ రూ.3 కోట్లు, సీ కేటగిరీలోని ప్లేయర్లకు రూ. కోటి జీతం అందుతుంది. సెంట్రల్ కాంట్రాక్ట్‌లో నాలుగు కేటగిరీల్లో ఆటగాళ్లను విభజించి వారికి బీసీసీఐ జీతాలు అందజేస్తుంది. టీమిండియా టెస్టు, వన్డే జట్టు కెప్టెన్ శుభమన్ గిల్‌కు ఈ సారి ఏ ప్లస్ గ్రేడ్ దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం గిల్ ఏ కేటగిరిలో ఉండగా.. జడేజా, బుమ్రా ఏ ప్లస్ కేటగిరీలో ఉన్నారు. డిసెంబర్ 22న జరిగే అపెక్స్ కౌన్సెల్ వార్షిక సమావేశంలో బీసీసీఐ ఇతర అంశాలపై కూడా దృష్టి పెట్టనుంది. అంపైర్లు, మ్యాచ్ రిఫరీల రెమ్యూనరేషన్ పెంపు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన అప్డేట్లు వంటి వాటిపై కూడా చర్చించనున్నారని తెలుస్తోంది. బీసీసీఐ అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగే తొలి అపెక్స్ మీటింగ్ ఇదే కావటం విశేషం.

# 'లాక్ డౌన్' మళ్లీ వాయిదా!




డిసెంబర్ 5 నుండి 12కు వాయిదా పడిన అనుపమా పరమేశ్వరన్ 'లాక్ డౌన్' మూవీ మరోసారి పోస్ట్ పోన్ అయ్యింది. అనివార్య కారణంగా ఈ సినిమాను 12వ తేదీ రిలీజ్ చేయడం లేదని చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ప్రకటించింది. ఈ ఏడాది అనుపమా పరమేశ్వరన్ నటించిన పలు చిత్రాలు జనం ముందుకు రావడానికి ముందు పలు సమస్యలు ఎదుర్కొన్నాయి. ఈ ఏడాది ఆమె నటించిన 'పరదా' సినిమా సైతం పలు మార్లు వాయిదా పడి ఎట్టకేలకు ఆగస్ట్‌లో విడుదలైంది. ఈ లేడీ ఓరియంటెడ్ మూవీపై అనుపమా పరమేశ్వరన్ చాలానే ఆశలు పెట్టుకుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ లోనూ, ప్రమోషన్స్ లోనూ పలు మార్లు భావోద్వేగానికీ గురైంది. ఇంత జరిగినా... ఆ సినిమా విడుదల తర్వాత ఎలాంటి ప్రభావం చూపించలేకపోయింది. ఆ తరువాత మలయాళ అనువాద చిత్రం 'జానకీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సెన్సార్ సమస్యలను ఎదుర్కొని విడుదలైనా... బాక్సాఫీస్ బరిలో ఏ రకమైన ప్రభావం చూపలేకపోయింది. ఈ నేపథ్యంలోనే ఆమె నటించిన తమిళ చిత్రం 'లాక్ డౌన్'ను డిసెంబర్ 5న విడుదల చేయబోతున్నట్టు లైకా ప్రొడక్షన్స్ సంస్థ తొలుత ప్రకటించింది. విశేషం ఏమంటే... ఈ సినిమాను నవంబర్ 23న గోవాలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా లో ప్రదర్శించారు. అయితే... లైకా సంస్థ చివరి నిమిషంలో ఈ సినిమా డిసెంబర్ 5న విడుదల చేయట్లేదని ప్రకటించింది. చెన్నైలో ఆ సమయంలో వర్షాలు కారణంగా దీనిని వాయిదా వేసినట్టు చెప్పింది. దాంతో ఈ మూవీ డిసెంబర్ 12కు వాయిదా పడింది. అయితే ఇప్పుడు కూడా ఈ సినిమా రావట్లేదు. ఈ విషయాన్ని లైకా సంస్థే స్వయంగా మరోసారి ప్రకటించింది. లైకా ప్రొడక్షన్ హౌస్ పైకి రకరకాల కారణాలు చెబుతున్న... ఆ సంస్థ కూడా ఆర్థికంగా చిక్కుల్లో ఉందని, అందువల్లే సినిమాను రిలీజ్ చేయలేకపోతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మరి 'లాక్ డౌన్' మూవీ ఎప్పుడు వెలుగు చూస్తుందో చూడాలి.

# ఆర్థిక చిక్కులు.. 'అన్నగారు' రావట్లేదు!

ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా తమిళ నటుడు కార్తీ తాజా చిత్రం 'అన్నగారు వస్తారు' సైతం ఆగిపోయింది. నిర్మాత కె.ఇ. జ్ఞానవేల్ రాజా పాత బకాయిలు తీర్చకుండా ఈ సినిమా విడుదల చేయడానికి ఆస్కారం లేదంటూ మద్రాస్ హైకోర్ట్ ఉత్తర్వులు జారీ చేసింది.

కార్తీ హీరోగా, కృతీశెట్టి హీరోయిన్‌గా నటించిన సినిమా 'వా వాతియార్'. ఇప్పటికే పలు దఫాలు వాయిదా పడిన ఈ సినిమాను డిసెంబర్ 12న విడుదల చేయబోతున్నట్టుగా నిర్మాత కె.ఇ. జ్ఞానవేల్ రాజా తెలిపారు. దానికి తగ్గట్టుగా ప్రమోషన్స్ చేశారు. తెలుగులో ఈ సినిమాకు 'అన్నగారు వస్తారు' అని పేరు పెట్టడంతో మొదలు పెట్టి... ప్రీ రిలీజ్ ఈవెంట్ వరకూ మంచి బజ్ క్రియేట్ చేశారు. కార్తీతో పాటు కృతీశెట్టి సైతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొంది. రెండు రోజుల ముందుకు కూడా యంగ్ హీరో సందీప్ కిషన్‌తో కార్తీ స్పెషల్ ఇంటర్వ్యూను మేకర్స్ రిలీజ్ చేశారు. 'సూదు కవ్వమ్' ఫేమ్ నలన్ కుమార స్వామి ఎనిమిదేళ్ళ తర్వాత డైరెక్ట్ చేసిన సినిమా కావడంతో అటు తమిళంలోనూ ఈ చిత్రానికి మంచి క్రేజ్ వచ్చింది.

ఇటీవల కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించిన సినిమాలేవీ కమర్షియల్‌గా సక్సెస్ కాలేదు. దాంతో ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా ఇప్పుడు 'వా వాతియర్' దానితో పాటు తెలుగు



డబ్బింగ్ వర్షన్ 'అన్నగారు వస్తారు' కూడా 12న విడుదల కావడం లేదు. గతంలో పారిశ్రామికవేత్త అర్జున్ లాల్ సుందర్ దాస్ వద్ద స్టూడియో గ్రీన్ జ్ఞానవేల్ రాజా రూ.10.35 కోట్లు అప్పు తీసుకున్నారని, ఆ మొత్తం ప్రస్తుతం రూ.21,78 కోట్లు అయిందని, దానిని చెల్లించేలా నిర్మాతకు ఆదేశాలు ఇవ్వాలని మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. దీంతో పాత బకాయిలు రూ. 21.7 కోట్లను చెల్లించిన తర్వాతే ఈ సినిమాను విడుదల చేయాల్సిందిగా మద్రాస్ హైకోర్ట్ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కార్తీ గత వారం రోజులుగా చేసిన పబ్లిసిటీ మొత్తం బూడిదలో పోసిన పన్నీరు అయిపోయింది.


# ఓటీటీలోకి '12ఏ రైల్వే కాలనీ'



అల్లరి నరేష్, కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం '12ఏ రైల్వే కాలనీ'. నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు సడన్ గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయికుమార్, గెటప్ శ్రీను, వైవా హర్ష, తదితరులు నటించారు.

కార్తీక్ (అల్లరి నరేష్) అనాథ. వరంగల్లోని రైల్వేకాలనీలో స్నేహితులతో కలిసి జీవిస్తుంటాడు. లోకల్ రాజకీయ నాయకుడు టిల్లు (జీవన్)కి తను నమ్మిన బంటు. అంతు ముందు రెండు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన టిల్లు.. ఈసారి ఎలాగైనా పదవిలోకి రావాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. ఆ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ఓ బాధ్యతను కార్తీక్ భుజాన పెడతాడు. దానిలో భాగంగా యువతను ఆకర్షించేందుకు కార్తీక్ ఓ ఆటల పోటీ నిర్వహిస్తాడు. ఆ పోటీల్లోనే ఆరాధన (కామాక్షి భాస్కర్ల)ను చూసి మనసు పారేసుకుంటాడు. మరి ఆ తర్వాత ఏం జరిగింది? అసలు ఆరాధన ఎవరు? ఆమె నేపథ్యమేంటి? ఆరాధన తన భార్య అంటూ కథలోకి వచ్చిన జయదేవ్ షిండే (అనీష్ కురువిల్లా)కి, హత్యకు ఏమైనా సంబంధం ఉందా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# దురంధర్ విజయం.. నాగవంశీపై ట్రోలింగ్





ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన తాజాచిత్రం 'దురంధర్' విజయవంతం కావటంతో అనుకోకుండా తెలుగు నిర్మాత సూర్యదేవర నాగ వంశీ ట్రోలింగ్‌కు గురువతున్నారు. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. ఈనెల 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లతో బాలీవుడ్‌కు కొత్త ఉత్సాహాన్నిస్తోంది. ఈ సినిమాపై ప్రశంసలు వెల్లువెత్తుతున్న వేళ టాలీవుడ్ నిర్మాత నాగవంశీ అనూహ్యంగా సోషల్ మీడియాలో విమర్శలకు గురయ్యారు. దీనికి కారణం స్టార్ డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ ఇచ్చిన ఒక వివాదాస్పద సమాధానం. ఈ పరిణామం తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య పాత వివాదాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. ఒక 'ఎక్స్' యూజర్...'దురంధర్' విజయాన్ని ప్రస్తావిస్తూ, నాగవంశీ పాత వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఆయన ఫొటోను పోస్ట్‌చేసి, 'ఈ వ్యక్తి ఎక్కడ ఉన్నాడు?' అని ప్రశ్నించారు. దీనికి సిద్ధార్థ్ ఆనంద్ వెంటనే స్పందిస్తూ, 'ఎక్కడో నిద్ర పట్టక బాధ పడుతున్నాడు' అని జవాబిచ్చారు. ఈ సమాధానం కొద్దిసేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆనంద్ దాన్ని డిలీట్ చేశారు. అయినప్పటికీ, స్క్రీన్‌షాట్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

## పాత వ్యాఖ్య ఇదీ..

సిద్ధార్థ్ ఆనంద్ ఈ విధంగా స్పందించడానికి కారణం, గతంలో నాగ వంశీ చేసిన ఒక కామెంట్ అని తెలుస్తోంది. ఒక రౌండ్‌టేబుల్ చర్చలో, నాగ వంశీ మాట్లాడుతూ, పుష్ప -2 ఒక్క రోజులో రూ. 80 కోట్లకు పైగా నెట్ వసూలు చేసినప్పుడు ముంబై మొత్తం నిద్ర పోయిందని నేను అనుకోను.. అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య అప్పట్లో బాలీవుడ్‌లో పెద్ద దుమారం రేపింది. తెలుగు సినిమా మార్కెట్, బాలీవుడ్ కలెక్షన్ల గురించి పోల్చిచెప్పడంపై చాలా మంది బాలీవుడ్ ప్రముఖులు అసహనం వ్యక్తం చేశారు. నాగవంశీ ఈ అంశాన్ని పక్కనపెట్టినప్పటికీ, ఆవివాదం తాలూకు కోపం బాలీవుడ్ వర్గాల్లో ఇంకా చల్లార లేదని సిద్ధార్థ్ ఆనంద్ తాజా జవాబు స్పష్టం చేస్తోంది. అందుకే 'దురంధర్' సక్సెస్ వేదికగా వంశీని ఎగతాళి చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి నిర్మాత నాగ వంశీ... యంగ్ హీరో నవీవన్ పోలిశెట్టి,మీనాక్షిచౌదరి జంటగా నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. బాలీవుడు దర్శకుడుచేసిన ఈ పరోక్ష వ్యాఖ్యలపై ఆయన మళ్లీస్పందిస్తారా? లేదా మౌనంగా ఉంటారా అనేది ఆసక్తికరంగా మారింది.ఏదేమైనా, 'దురంధర్'విజయోత్సవ వాతావరణంలో, ఈ రెండు పరిశ్రమల మధ్యమాటల యుద్ధం మళ్లీ మొదలైందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు.

# అడవిలో.. చిమ్మచీకటిలో మూడు గంటలు!



భయమంటే ఏమిటో అరణ్య షూటింగ్‌లో తెలిసొచ్చిందని నటుడు రానా దగ్గుబాటి చెప్పారు. రానా, విష్ణు విశాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరణ్య'. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అడవి, ఏనుగుల రక్షణ కోసం పాటుపడే వ్యక్తిగా రానా నటించారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో రానా ఆ సినిమా షూటింగ్ రోజులను గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశంలోకి ఏనుగుల గుంపు వచ్చిందని చెప్పారు. అరణ్య షూటింగ్ కోసం ఆరు నెలలు అడవిలో ఉన్నాం. మేము కొన్ని సన్నివేశాలను ఏనుగులు ఉండే ప్రాంతంలో చేశాం. సాయంత్రం సమయానికి వెళ్లిపోవాలి అన్నారు. అనుకున్న టైముకు మన షూటింగ్‌లు ఎప్పుడూ ముగించరని అందరికీ తెలిసిందే. దీంతో రాత్రి వరకూ అక్కడే ఉన్నాం. నేను సన్నివేశంలో భాగంగా దూరంగా ఉన్నాను. హటాత్తుగా అందరూ గబగబా వెళ్లిపోతున్నారు. ఎందుకు ఇలా పరిగెడుతున్నారు అని చూసేసరికి ఏనుగులు మా వైపునకు వస్తున్నాయి. దీంతో నేను, మరికొంతమంది వాటికి కనిపించకుండా చెట్ల చాటుకు వెళ్లాం. కొంచెం కూడా శబ్దం చేయకుండా అలానే మూడు గంటలు ఉన్నాం. ఆ చిమ్మచీకట్లో అలా మూడు గంటలు ఉండడం ఎప్పటికీ మర్చిపోలేను. అడవి ఎంత భయంకరంగా ఉంటుందో మొదటిసారి అప్పుడే అర్థమైంది.. అని రానా ఆ రోజులను గుర్తుచేసుకున్నారు.

'నేనే రాజు.. నేనే మంత్రి' తర్వాత రానా నటించిన సినిమా 'అరణ్య'. కొవిడ్ లాక్ డౌన్ తర్వాత విడుదలైన తొలి పాన్ ఇండియా చిత్రం కూడా ఇదే. ఇందులో రానా ఫారెస్ట్ మేన్‌గా నటించారు.